ఆదివారం

# ప్రజాశక్తి

మే 1, 2005

# హ్యాపీ బర్త్ డే

**1.5.2005 నుంచి 7.5.2005 వరకు**

ప్రభాకర్
2సం॥, 1.5.2003
రత్నకుమారి-శివన్నారాయణ
పల్లెర మూడి-కృష్ణా

వంశీయాదవ్
7సం॥, 1.5.1998
కృష్ణవేణి-చెన్నయ్యయాదవ్
బుద్దాయపల్లె-కడప

అజయ్(బ్రహ్మదేవర)
7సం॥, 1.5.1998
శ్రీచైతన్య-శ్రీనివాస్
మిర్యాలగూడ-నల్లగొండ

రోహిత్ యాదవ్
4సం॥, 1.5.2001
జ్యోతి-రామారావు యాదవ్
హైదరాబాద్

ధవాన్
3సం॥, 1.5.2002
లక్ష్మి-శ్రీనివాస్
నల్లగొండ

సాయి పూజిత
1సం॥, 2.5.2004
సూర్యకళ-శ్రీను
రాజపుత్రునిపల్లె-విజయనగరం

స్రవంతి
1సం॥, 4.5.2004
ధనలక్ష్మి-శ్రీహరి
ఉప్పలూరు-కృష్ణా

సంధ్య
1సం॥, 5.5.2004
రత్నకుమారి-రామకృష్ణారావు
తాళ్లపూడి-ప॥గో॥

బన్ను(ముత్తు)
2సం॥, 6.5.2003
కవిత-సత్యనారాయణ
మాధవరం-నల్లగొండ

అంకిత
1సం॥, 7.5.2004
వరలక్ష్మి-సూర్యప్రకాశ్‌రావు
మాల్కాపురం-విశాఖ

నీహారిక
2సం॥, 7.5.2003
శ్రీలక్ష్మి-రవికిషోర్
శనివారపుపేట-ప॥గో॥

రమీవుల్
6సం॥,1999
ఆఫ్రీన్-అన్వర్
ముత్తుకూరు-నెల్లూరు

శ్రీతేజ
6సం॥,1999
అన్నపూర్ణ-రాజశేఖర్
ఉండవల్లిసెంటర్-గుంటూరు

గౌరీ సాయి తేజస్వి
5సం॥,2000
కన్యాకుమారి-సాంబశివరావు
తుళ్లూరు-గుంటూరు

బన్ని
1సం॥,2004
లలిత-ప్రకాశ్
నల్లగొండ

శ్రీలేఖ
3సం॥,2002
అన్నపూర్ణ-రాజశేఖర్
ఉండవల్లిసెంటర్-గుంటూరు

అశ్రీతరెడ్డి
3సం॥, 2002
సరిత-జగన్‌రెడ్డి
నకిరేకల్-నల్లగొండ

అమల
పద్మా-జయరాజు
పజ్జూరు-నల్లగొండ

సోహైల్
5సం॥, 2000
అరీఫా-ఇక్బాల్
బచ్చన్నపేట్-వరంగల్

తహసీన్
3సం॥,2002
సాజిదా-మన్సూర్
ముత్తుకూరు-నెల్లూరు

వేదవర్షిత
కవిత-ధనుంజయ్
కృష్ణాపురం-చిత్తూరు



# రీడర్స్ మెయిల్

టు ది ఎడిటర్, ప్రజాశక్తి ఆదివారం అనుబంధం



## వార్తా పత్రికల హవా

ఏప్రిల్ 17 ఆదివారం 'ప్రజాశక్తి'లో 'వార్తాపత్రికల విస్ఫోటనం' వివరణాత్మక కవర్‌స్టోరీ చదివాము. ప్రస్తుతం వార్తాపత్రికల హవా ఎంత ఉధృతంగా వీస్తోందో తెలుసుకున్నాం. పత్రికల సర్క్యులేషన్ పెరగటంలో ప్రకటనదారుల పాత్ర ఏమిటో తెలిసింది. ఈ నేపథ్యంలో బుల్లితెర ఛానళ్ళు పత్రికలతో జతకట్టడం... ఫలితంగా ప్రకటనల ద్వారానే పత్రికలు ఎక్కువ ఆదాయం గడించడం ఆశ్చర్యం కలిగించింది. వ్యాసంలో హిందీ, ఆంగ్ల పత్రికల తీరుతెన్నులే ప్రస్తావించారు. తెలుగు పత్రికల పరిస్థితిని ప్రస్తావించి వుంటే బావుండేది.

**వి. సుభాషిణి,**

**లక్ష్మీనరసయ్య కాలనీ, అనంతపురం.**

## వార్తాపత్రికల విస్ఫోటనం

17వ తేదీ ఆదివారం కవర్‌స్టోరీ బాగుంది. వ్యాపకంగా మొదలైన వార్తపత్రికల విస్ఫోటనం పరిశ్రమగామారి సర్క్యులేషన్ చుట్టూ పత్రికలు అంతర్జాతీయ వాణిజ్యకేంద్రంగా చేసుకున్న విధం బాగా వివరించారు. సంక్షోభం నివారింపబడాలని ఆశిద్దాం. కార్టూన్ కదంబం, సామాజిక, రాజకీయ అంశాలపై నవ్వుపుట్టించే విధంగా ఉన్నాయి.

**కె. ప్రభాకర్,**

**చిమిర్యాల, నల్గొండ.**

## వర్షం కురిసిన రాత్రి

ఏప్రిల్ 17న ఆదివారం అనుబంధంలో ప్రచురించిన "వర్షం కురిసిన రాత్రి" కథ చాలా బాగుంది. రచయితకు ధన్యవాదాలు. "చిలుక వాలిన చెట్టు" మా ఇంట్లో పిల్లలందర్నీ ఎంతో ఆకట్టుకుంది. ఒక పేపర్‌బోయ్ ఇంజనీర్ అవ్వడం ఈనాటి చదువుకున్న విద్యార్థులకు మేలుకొలుపు పట్టుదలతో ఏదైనా సాధించవచ్చు అని నిరూపించిన ఆ నిరుద్యోగి యావత్ చదువుకున్న విద్యాలోకానికే హైలెట్.

**చిప్పాడ ఉమామహేశ్వరరావు,**

**కురుపాం, విజయనగరం జిల్లా.**

## రియల్‌స్టోరీ



"ఇంజనీర్ అయిన పేపర్‌బోయ్" అనే స్టోరీ నన్ను కలువరింపజేసింది. ఈ రోజుల్లో పట్టుదలతో కృషి చేస్తే ఋషులవుతారు. విజయ్ చేస్తున్న కృషి అభినందనీయం. ప్రతి ఒక వ్యక్తికి లక్ష్యం అనేది వుంటే కచ్చితంగా గమ్యం చేరగలడు. ప్రజాశక్తికి అభివందనములు.

**కలకొండ ప్రభాకర్,**

**చిమిర్యాల, నల్గొండ.**

## కవిత

కళాసాహితిలో – బ్రతుకే షడ్రుచుల పచ్చడి క్షేత్రంగా మారిపోయినపుడు ఇంకెందుకు 'ఉగాదిపచ్చడి' అని సామాజిక అంశాలను ఉగాది రుచులతో పోల్చిన కవిత చాలాబాగుంది. అలాగే ప్రజలు సుఖశాంతులతో ఉన్నపుడే ఏ సంవత్సరాదైనా... అన్న 'ఉగాది కవిత' బాగుంది. ''ఇంజనీర్ అయిన పేపర్‌బాయ్'' కృషికి, సహాయసహకారాలు అందించిన వారికి అభినందనలు. ఇలాగే చాలామంది ఎదిగినవారు ఎదగాల్సినవారూ ఉన్నారు. వారుకూడా తగిన స్థాయికి చేరుకోవాలని ఆశిద్దాం.

**కె. జహంగీర్, నెల్లూరుజిల్లా.**

## సురభి బతకాలి

ఈ వారం కళాసాహితిలో సురభి నాటకోత్సవాల గురించి చక్కగా రాశారు. వాస్తవానికి ఆర్థిక ఇబ్బందుల మూలంగా కళాకారులు తమ కళాప్రక్రియలు ప్రదర్శించలేకపోతూ సతమతమవుతూ వున్నారు. ప్రభుత్వం పనికి ఆహార పథకం వలె కొత్త పథకాలను ప్రవేశపెట్టి "ఆరు రోజుల కనీస ఉపాధి" క్రింద ప్రదర్శనలు ఉండేట్లుగా చేయాలి. అప్పుడు నిజంగా సురభి కళాకారులను ఆదుకున్నట్లు అవుతుంది.

**జె. సుధాకర రావు,**

**శ్రీ యువరంజని కళావేదిక, కాకినాడ.**

# నోరుంది కదా...!

నోరుంది దేనికి చెప్పండీ?!

నోరుంది కేవలం ముక్కుకింది గొయ్యిలాగా పడి ఉండడానికా... లోకంలో ఉన్న షడ్రుచులూ దాంట్లో పడేయడానికా చెప్పండి?

అదొక పని మాత్రమే...ఇంకా చాలా అవసరాలూ, పనులూ ఉన్నాయని వేరెవరూ ఇంకొకరికి చెప్పక్కర్లేదండీ బాబో....

ఎక్కడిదాకో ఎందుకండీ...ఈ మే నెల ఎండదెబ్బకి మిమ్మల్ని అడక్కుండానే నోరు, నోరుతెరుస్తుంది. దాహం...దాహం అంటూ పిడచకట్టుకుపోతుంది.

దాహానిక్కూడా దాహం వేసి సొమ్మసిల్లిపోయేంత నీటి కరవు 'సుజలాం...సుఫలాం' దేశాన పుష్కలం! నీళ్ళే లేక చస్తుంటే...మంచి నీళ్ళెక్కడని వెతికేదీ?!

మంచినీళ్ళ కంటే 'మాంఛి మంచినీళ్ళు' పోచ్ ప్యాకెట్లలో, పేక్డ్ బాటిళ్ళలో, ఆర్డర్డ్ రీఫిళ్ళలో పాల లెక్కన లీటర్ల కొద్దీ మనం కొనుక్కోగలిగినంత దొరుకుతాయి. కాపోతే పాలయినా నీళ్ళయినా ధర మాత్రం ఒకటే అన్న జీవితసత్యం భళ్ళున తెలిసి మన బుర్ర గింగుర్లెత్తొచ్చు. కాస్తంత జాగ్రత్త సుమండి!

ఈ ఎండాకాలాన నీటి పురాణమిలా నోరెత్తి చెబుతుంటే ఎంతయినా చెప్పొచ్చు. ఖాళీ కుండల కొట్లాటలెన్నయినా చూపొచ్చు. నీటి ట్యాంకుల బారు క్యూల నేలబారు జనం దప్పిక అరుపులెన్నయినా వినొచ్చు. వినే నాథుడుండొద్దూ! వినాల్సినవారు చెవుల్నిండా బేళ్ళకొద్దీ మాన్‌సాంటో బీటి పత్తిదూది దూర్చుకున్నాక శంఖం ఊదాల్సిందే మరి.

"నోరుంది కదాని నోరుపారేసుకోకూడదూ..." అని సాగదీస్తూ అనడం, అనిపించుకోడం వింటూనే ఉన్నాం.

అయితే ఆ సామెతను ఎలాపడితే అలా విసిరితే కూడా నోరు జారినట్లే మరి!

నోరుంది దాహం తీర్చుకోడానికే కాదు...హక్కుల దాహం తీర్చుకోడానికి కూడా ఉంది.

కోటానుకోట్ల నోళ్ళు ప్రపంచ కార్మికులారా ఏకంకండో అని అరచినరోజు ఇవ్వాళ.

"మే దే" అని నోరారా పలికేది ఇవ్వాళే.

❁

ఈ సంచికలో . . .


ఓరా! . . . 3
కార్టూన్ కదంబం... . . . 4
కవర్ స్టోరీ . . . 5
జీవనశైలి . . . 10
బాలలకథ . . . 11
బాలనేస్తాలు . . . 12
ఇంతి సంగతులు . . . 16
నువ్వద్ది . . . 17
ఆరోగ్యం . . . 18
పుస్తక పరిచయం . . . 21
న్యాయసలహాలు . . . 24


ఇంకా...

పాయిఖానాలు పోయె టాయిలెట్లు వచ్చె

కథ ... 8, 9

రియల్ స్టోరీ ... 14, 15

టూరిస్ట్‌గైడ్ . . . 21

విస్మృత మధుర స్వరం మన్నాడే

కళాసాహితి . . . 22, 23

## "అదుగో చంద్రలోకం...వెలసే మనకోసం"

"చందమామ రావే జాబిల్లి రావే...కొండెక్కి రావే గోగుపూలు తేవే" అని భూమండలం మీదున్న తల్లి పాలబువ్వలు తినిపించేది. ఏకంగా చంద్రమండలంలోనే ఇల్లు కట్టుకున్నాక...అక్కడ నుంచి ఆకాశంలోకి చూస్తే చందమామయ్య ప్లేస్‌లో కనబడే భూగోళాన్ని చూపించి, "భూమి బాబాయి రావే...బూరెల గంప తేవే..." అని పాడాలేమో! ఇటీవలే మన హైదరాబాద్‌కు చెందిన రాజీవ్ బాగ్ది చంద్రమండలాన ఐదెకరాలు ఖాళీస్థలం కొన్నాడు. న్యూయార్క్‌లో ఉన్న లూనార్ రిపబ్లిక్ సొసైటీ వారు తమ వెబ్‌సైట్ తెరపై చంద్రలోకంలో ఉన్న సదరు ఖాళీజాగా శాటిలైట్ ఫొటోలు చూపించి బేరం పెట్టారు. ఆ ఇమేజ్‌లు చూసి మురిసిపోయి కొన్న ఆ స్థలాన ఏ "చంద్ర ఎపార్ట్‌మెంట్స్" కట్టనున్నాడో మరి ఆ హైదరాబాదీ సిమ్మెంట్ డీలర్ రాజీవ్ బాగ్ది. లూనార్ రిపబ్లిక్ సొసైటీవారు చేస్తున్న ఈ అంతర్లోక రియల్ ఎస్టేట్ బిజినెస్‌పై అనుమానాలేవీ వద్దంటూ, ఏకంగా దస్తావేజులు కూడా దయచేయిస్తున్నారు. ఆ చంద్రలోక నివాసస్థల పట్టా పుచ్చుకుని ఇంటికొచ్చిన రాజీవ్‌ను చూసి కొడుకులు నవ్వుకున్నా...రేపు నా మనుమలు ఎంతో సంతోషిస్తారు సుమా అనంటున్నాడు. అందుకు డాబాపైకి తీసుకుపోయి ఇప్పటినుంచే చంద్రుణ్ణి చూపించి అదుగోరా మన స్థలం అక్కడుంది అనంటున్నాడేమో కూడా!!

## డయానా మరణం ఇప్పటికీ సంచలనమే!

ప్రిన్సెస్ డయానా మరణించి చాలాకాలమే అయ్యింది. కథలూ కాకరకాయలకు కావలసినంత సమాచారం అందించి మరీ చనిపోయిందా అందాలరాణి. ఆమె, ఆమె భర్తలుంగారు ప్రిన్స్ చార్లెస్... వారివారి వ్యవహారంబులు కొన్ని కొన్ని పత్రికలకు వేడివేడి భరాణీలు. ఇటీవలొక వెబ్‌సైట్ ఉత్తర విశేషాలివి. ఒక ఇంగ్లీష్ రాణి తన ఈజిప్ట్ బోయ్‌ఫ్రెండ్‌తో కలసి డచ్ దేశపు ఇంజన్ ఉన్న జర్మనీ కారులో బెల్జియం దేశపు డ్రైవర్ తోలుతుండగా ఫ్రెంచ్ సొరంగంలో యాక్సిడెంట్ అయి దుర్మరణం పాలైంది. దర్యాప్తులో తేలిందేవిటంటే ఆ బెల్జియం డ్రైవర్ స్కాటిష్ విస్కీ తాగి ఉన్నాడని, ఈ ప్రేమ జంటను జపనీస్ మోటార్‌సైకిళ్ళపై ఇటలీ పత్రికావిలేఖర్లు ఫొటోలు తీయడానికి వెంబడించారనీ, వారికి అందకూడదని పరుగులు తీయించి యాక్సిడెంట్ పాలయ్యారని తేలింది. గమ్మత్తుగా లేదూ...డయానా మరణంపై ఈ విచిత్ర విశ్లేషణలోనూ గ్లోబలైజేషన్ కనబడ్డంలేదూ!!



## షంషేర్ పెళ్ళికొడుకాయెనే!

షంషేర్‌కు ఎట్టకేలకు తగిన వధువు కుదిరింది. ఆ ఘనత ఆధునిక పేరయ్య శ్రీమాన్ వెబ్‌సైట్‌కే దక్కుతుంది. వెబ్‌సైట్ పేరిశాస్త్రిగారు కుదిర్చింది మరెవ్వరినో కాదు. డయానా అనే వధువుని. ఇంతకూ అసలు విషయం ఏవిటంటే షంషేర్ ఒక పులిలాంటి గ్రామసింహం, అతగానికి కుదిరిన నవ వధువు డయానా అనే గ్రామ సింహణి. జైపూర్‌లోని అంతర్జాతీయ డాగ్స్ బజార్ వారు ఒక "శునక వివాహ సమాచార సైట్"ను ప్రారంభించారు. వారే ఈ సంబంధం కుదిర్చారు. శునకుడి ఫొటో, వారి జాతి, ఎత్తు, బరువు, రంగు, ముఖ్యంగా విత్తనం తదితర వివరాలు నమోదు చేస్తే తగిన శునకిని సెలెక్టు చేసిపెట్టి పుణ్యం కట్టుకుంటారుట. ఉత్తి పుణ్యానికి కాదు. సర్వీసు బిల్లు మామూలేనండోయ్.

పాదయాత్ర వల్లే విజయం
—నాయకులు
పాదయాత్ర కాదు 'ప్రభువు' వల్లే పదవి
—అల్లుడు
వైఎస్


కష్టాలు అడిగితే చెప్పాను అంతే...
రైతు చైతన్యయాత్రలో రైతుల కష్టాలు తెలుసుకుంటున్న అధికారులు

# కార్టూన్ కదంబం


సరైన తోడు దొరికే వరకు మిమ్మల్ని వదిలేది లేదు
బిజెపి
టిడిపి


శాంతి సందేశ్ యాత్ర

# సమ్మర్ హాలిడేస్...జాలీ డేస్!

వి.వి.వరప్రసాద్

సమ్మర్ హాలిడేస్... ఈ మాట వింటే విద్యార్థులకు ఎక్కడలేని ఉత్సాహం పొంగుకొస్తుంది. ఏడాదంతా కష్టపడి చదివి పరీక్షలు రాసిన అనంతరం వారికి ఆట విడుపునిచ్చేది ఈ వేసవి సెలవులే. గతంలో...మన చిన్నతనంలో పరీక్షల చివరి రోజున భారం దించుకున్నంత సంతోషం వ్యక్తం చేసేవారు. ఆ రోజు నుండి వేసవి సెలవులు ఏ విధంగా గడిపితే బాగుంటుందన్న ప్లాన్లు. పిల్లల శలవులతో పాటు పెద్దలు కూడా తమ సెలవులు కూడబెట్టుకుంటున్నారు. అలా వేసవి శలవులు కుటుంబమందరి హాలిడేస్‌గా భావిస్తున్నారు. ఎక్కడికైనా వెళ్ళే విహారయాత్రలో ఏడాది శ్రమను మర్చిపోయి రిలాక్స్ అయ్యేందుకు రెడీ అవుతున్నారు.

అమ్మా నాన్నలు కుటుంబమంతా సంతోషంగా గడిపేందుకు అనువైన ఊళ్ళకు వెళదామనుకుంటారు. మామ్మ తాతయ్యలు ఏ పుణ్య క్షేత్రాలకైనా వెళ్ళేలా అబ్బాయి ప్లాను చేస్తే బాగుండని అడగలేక అలా చూస్తూ ఉంటారు. చెల్లాయేమో కులూ.. మనాలీ లేదా ఊటీ వంటి వేసవి విడిది ప్రదేశాల గురించి ఎక్కడో చదివివుంటుంది...అక్కడికెళ్దాం అంటూ అమ్మ దగ్గర డిమాండ్ పెడుతుంటారు. ఎంచక్కా పుట్టి పెరిగిన ఊళ్ళు వెళ్ళి అక్కడి పల్లె వాతావరణంలో గడపాలని ఉవ్విళ్లూరే వారు కూడా కొందరు లేకపోలేదు. పల్లెటూరి వాతావరణం అనగానే చెరువు గట్టున దేవాలయం... చెరువులో కలువ పూలు, కోతలు అయిపోయిన పొలాలల్లో తాటికాయల కోసం పరుగులు, తాటిముంజలు కోసేవారికి, తినేవాళ్లకు మధ్య పోటీలు అవన్నీ మరచిపోలేని మధురస్మృతులు. ఇప్పుడవన్నీ గత చరిత్ర ఖాతాలోకి జమ అయిపోయాయి. అన్ని తరగతుల వారికి పరీక్షలు అయిపోయి సెలవులిచ్చేశారు. కొందరికప్పుడే పరీక్షా ఫలితాలు కూడా తెలిసిపోయాయి. ఇక వారు, వారి పెద్దలు వేసవిశలవుల ప్రయాణాలకు రెడీ!

### ఎవరి జేబుసత్తా వారిది!

ఈ వేసవి శలవుల సందర్భంగా అనేక ట్రావెల్ ఏజెన్సీలు తమతమ టూర్‌ప్యాకేజీలతో ముందుగానే సిద్ధమయి ఉంటాయి. అందుకు ఆకర్షణీయమైన ప్రకటనలు, బ్రోచర్లతో ప్రచారం ఊదరగొడుతుంటారు. వెబ్‌సైట్లలో ఆ హడావుడి మరింత హైటెక్‌గా ఉండి, సెలెక్ట్ అండ్ క్లిక్ అన్నంత వేగంగా జరిగిపోతుంది. వెళ్ళాలని ఊరించిన



# వేసవి విడిది విశాఖతీరం

పిల్లలతో పాటు పెద్దలు కూడా వేసవి సెలవులను ఆనందంగా ఆహ్లాదంగా గడిపేందుకు విశాఖ చక్కటి ప్రదేశం. సహజ సౌందర్యానికి పుట్టినిల్లు విశాఖ. బంగారు వన్నెతో మిలమిల మెరిసిపోయే పొడవైన ఇసుక తిన్నెలు, ఎండలో వెన్నెల్లో వెండి తరగల్లా మెరిసిపోయే సాగరజలాలు, ఉవ్వెత్తున విరుచుకుపడే కెరటాలు, బారులు తీరిన ఎత్తయిన కొండలు, నగర పరిసర ప్రాంతాల్లో అడుగు పెడితే కనుచూపు మేరలో పరుచుకున్న పచ్చదనం విశాఖ సొంతం. ధనికులు సహా మధ్య తరగతివారు సైతం భరించగలిగే వసతి సదుపాయాలుండటంవల్ల విదేశీయులు కూడా నిత్యం వేలాదిమంది పర్యాటకులు విశాఖకు వస్తూంటారు. వేసవి సెలవుల్లో వీరి సంఖ్య రెట్టింపవుతుంది.

నగరంలోని సింహాచలం, కైలాసగిరి కోన, ఆర్‌కె బీచ్, జూ, రుషికొండ, ఏరాడ, సబ్మెరైన్ మ్యూజియం, రాక్ హిల్స్, ఎంజిఎం పార్క్ వంటి ప్రదేశాలను కలుపుతూ పర్యాటక సంస్థ టూర్ ప్యాకేజిని నిర్వహిస్తోంది. పెద్దలకు 280, పిల్లలకు 220 రూపాయల వంతున ఛార్జీలున్న ఈ ప్యాకేజిలో భోజనం, టీ, టిఫిన్ ఏర్పాట్లు కూడా వున్నాయి. ఇక విశాఖకు దగ్గరలోని అరకు వ్యాలీని, బొర్రా గుహల సందర్శన



కోసం రైలు రోడ్డు మార్గంలో ఒక ప్యాకేజి అందుబాటులో వుంది. ఇందులో టీ, టిఫిన్, భోజన సదుపాయాలతో కలిపి పెద్దలకు 400, పిల్లలకు 300 రూపాయల వంతున వసూలు చేస్తున్నారు. దీనితో పాటు అన్నవరం, తలుపులమ్మ లోవ, భువనేశ్వర్ టూర్ ప్యాకేజీలు కూడా నిర్వహిస్తున్నారు. ఈ ప్యాకేజీలో అరసవల్లి, శ్రీకూర్మం, శ్రీముఖలింగం, కోణార్క్, పూరి, పిప్లీ, చిల్కా సరస్సు తదితర ప్రాంతాలను సందర్శించే అవకాశం వుంది. ఈ ప్యాకేజీలో పెద్దలకు 1100, పిల్లలకు 880 రూపాయల వంతున ఛార్జీ వసూలు చేస్తారు. విశాఖపట్నానికి 25 కి.మీ దూరంలో భీమునిపట్నం బీచ్ రిసార్ట్ ప్రముఖ పర్యాటక స్థలంగా పేరొందింది

-భూసా అప్పలరెడ్డి,విశాఖపట్నం



పిక్నిక్‌స్పాట్ సెలెక్షన్‌తో పాటు ఆయా ట్రావెలింగ్ ఏజెన్సీతో "మాయాపెట్టె వెబ్‌తీగెల అదృశ్య తరంగాల కనెక్షన్" (ఇంటర్నెట్) ద్వారా టిక్కెట్ల రిజర్వేషన్ కూడా అయిపోతుంది. అంతచేటు ఎగరలేని మధ్యతరగతి జనులు, తమకు తెలిసినంతలో ఎక్కడికెళ్ళితే ఏమేమి చూడవచ్చో, ఎంతెంత ఖర్చులు అవుతాయో తోటి ఉద్యోగస్తుల, స్నేహితుల ద్వారా తెలుసుకుంటారు. తమ తమ పిల్లల కోరికలకు, తమ జేబు బరువు సరిచూసుకుని ఆ మేరకు ఎటువెళదామా నిర్ణయించుకుంటారు. రైల్వే, ఆర్టీసీ శాఖల ప్రత్యేక సదుపాయాలో, ఆరాకొరగా ఉన్న సదుపాయాల్లోనో తమ శక్తిమేరకు ప్రయాణాలు కడుతుంటారు. పర్యాటకుల సౌకర్యం కోసం రైల్వే, ఆర్టీసీ సంస్థలు ప్రత్యేక ఏర్పాట్లు కూడా చేశాయి. రైల్వేశాఖ 110 ప్రత్యేక రైళ్ళను ఏర్పాటు చేస్తే, ఆర్టీసీ వేసవి రద్దీని తట్టుకునేందుకు అదనపు బస్సు సర్వీసులతో సమాయత్తమవుతోంది. ఉన్నత స్థాయి కుటుంబాలవారు దూర ప్రాంతాలకు ప్రయాణం అవుతుంటే కాస్త మధ్య తరగతి, దిగువ మధ్యతరగతి స్థాయి వారు మాత్రం తమకు దగ్గరలోని ప్రదేశాలను సందర్శించేందుకు సిద్ధమవుతారు. ఈ కాలంలో అనేక మందికి తమ చుట్టుపక్కల వున్న ప్రదేశాలతోనే సరిగ్గా పరిచయం వుండటంలేదు. ఎంతసేపూ దూరపు కొండలు నునుపు అన్న సామెత మాదిరిగా దూరంగా వుండే ప్రాంతాలపైనే దృష్టి పెడుతున్నారు. మన చుట్టుపక్కల ప్రాంతాలను ముందు పరిచయం చేసుకుని, తరువాత మన జిల్లా, మన రాష్ట్రం, మన దేశం అన్న రీతిలో ప్రయాణిస్తే ఆయా ప్రాంతాల పరిచయంతో పాటు కొంత లోకజ్ఞానం కూడా పెరిగే అవకాశాలుంటాయి.

**శలవులకంటూ ఒక అర్థం ఉందిమరి!**

ఇప్పటికీ ఉన్న ఈ సమాజం, దానిలో మన బతుకుల తీరు ఎన్నో మార్పులు చెందీచెందీ ఇలా ఏర్పడింది. ప్రతీ జీవి తన మనుగడకు తప్పనిసరి కష్టం చేసి, ఎంతోకొంత విరామం కోరుకోవడం, పొందడం చాలా సహజమైనది. మానవసమాజం రకరకాల వారితో కూడినదై ఉందికదా! అందులో రైతులు, చేతివృత్తిదారులులాంటి వారుంటారు. వారికి ఉద్యోగులులాగా "శలవులిచ్చారహో..." అనేటట్లు విరామం ఉండదు. కానీ వారి ఉత్పత్తి విధానం ఇచ్చే విరామం ఉంటుంది. అవే వారి శలవులన్నమాట. కానీ వ్యవసాయంలో, వృత్తుల్లో వచ్చిన ఒడుదుడుకులు అలాంటి సంతోషసమయాలు లేకుండా చేస్తున్నాయి. అది వేరే సంగతి. వీటిమధ్య గ్రామసీమల్లో ఉండే ఈ వ్యవసాయ కుటుంబాల దగ్గరకు ఉద్యోగాల రిత్యా పట్టణాలదరి చేరిన తమ బిడ్డలు, వారి బిడ్డలతో వచ్చేందుకు ఈ శలవులు ఉన్నాయన్న సంతోషం ఒకింత ఊరట.

ఈ సామాజిక నేపథ్యంలో శలవులు ఎలా గడపాలి అనేదానికి



# శలవులకు జంట నగరాలు

వేసవి సెలవులకు అందరూ హైదరాబాద్ వచ్చేందుకే మక్కువ చూపిస్తుంటారు. పురాతనమైన అపురూప కట్టడం చార్మినార్, గోల్కొండ, నగర నడిబొడ్డున అందమైన హుస్సేన్‌సాగర్, దానికి అనుకునే సంజీవయ్యపార్క్, స్నో వరల్డ్, బిర్లా మందిర్, సాలార్‌జంగ్ మ్యూజియం, ఎన్‌టిఆర్ పార్కు, శిల్పారామం, లుంబినీపార్కు అందులోని లేజర్‌షో లాంటి అందమైన ప్రదేశాలు ఉన్నాయి. వేసవి సెలవుల్లో నగరానికి వచ్చిన వారు ఎక్కువగా సాయంత్రపు సమయాల్లో ఎన్‌టిఆర్‌పార్కు, లుంబినీపార్కుల్లో గడిపేందుకు ఎంతో అనుకూలంగా ఉంటుంది. హుస్సేన్‌సాగర్ నుండి వచ్చే పిల్లగాలులను ఆస్వాదిస్తూ గంటల తరబడి ట్యాంకుబండ్‌పై గడపవచ్చు. అయితే వీటిల్లో ప్రవేశించేందుకు ధరలు మాత్రం తక్కువగా ఉన్నా అందులోకి వెళ్లాక మాత్రం చేతిచమురు బాగానే వదులుతుంది. ఇటీవల చార్మినార్‌పైకి ఎక్కేందుకు అనుమతి ఇచ్చారు. దీనిపై నుండి చూస్తే అద్భుతమైన హైదరాబాద్ నగరం సుందరంగా కనిపిస్తుంది. అక్కడ నుండి గోల్కొండకోట, బిర్లామందిర్ కూడా కనిపిస్తాయి. మరో కట్టడం మక్కామసీదు. దీనిని 1614లో ఆరో కుతుబ్‌షాహీ నవాబు నిర్మించాడు. ఒకేసారి 10వేల మంది భక్తులు ప్రార్థనలు

కొంత మానవీయకోణం కూడా ఉండటం అవసరం. చాలా రోజుల తరబడి ఒకేచోట, ఒకే పరిసరాల్లో, ఒకే వ్యాపకంలో ఉంటాం కదా! ఇలాంటి వాటినుంచి మన సమాజమే కల్పించిన అనేక సందర్భాలు మనల్ని మన ఇళ్ళనుంచి కదిలి ప్రయాణం చేయిస్తున్నాయి. ఇలాంటి పర్యటనల పట్ల రకరకాల దేశాల్లో రకరకాల ఆలోచనలున్నాయి. వ్యక్తిగత వికాసానికి తప్పనిసరి అని హాలెండు దేశపువారనుకుంటే, నెదర్ల్యాండ్స్‌లో ఒక పవిత్ర మత కార్యం అనుకుంటారు. పాశ్చాత్య దేశాలన్నింటిలో తమ కుటుంబ, ఆఫీసు బడ్జెట్టులోనే అంటే జీతంలోనే ఇలాంటి ప్రయాణాలకొక కేటాయింపు స్థిరపడిపోయి ఉంటుంది. మన దేశానికి సంబంధించి ప్రయాణం అనగానే పెళ్ళిళ్ళకో, దినకార్యాలకో కాకపోతే తీర్థయాత్రలకో అనే అనుకుంటారు. వీటిలోనే ఇమిడివున్న సామాజిక అంశాన్ని గురించి అనుకోరు. "పర్యటన లేదా ప్రయాణం అనేది విలువల్లోనూ, వ్యక్తిగత ప్రవర్తనల్లోనూ, కుటుంబ సంబంధాల్లోనూ, నైతిక సూత్రాల్లోనూ, సాంప్రదాయ క్రతువుల్లోనూ మొత్తంగా సామాజిక వ్యవస్థలో మార్పులకు దోహదపడుతుంది" అని 'టూరిజం అండ్ సొసైటీ' పుస్తకం రాసిన షాలినీ మోడీ అంటారు. మనం గమనించం గానీ మనం ఇలా శలవులకు, కుటుంబ కార్యక్రమాలకు ప్రయాణం చేసి రాగానే మనలో మన పిల్లల్లో కొద్ది రోజులపాటుండే జ్ఞాపకాలు, వారిలో వచ్చే మార్పులు ఇవే మరి. ఆ మార్పులు తరుచు జరిగితే అవే మన ప్రవర్తనల్లో, అభిరుచుల్లో భాగం అయిపోతాయన్న మాట. అందుకు ఉపయోగపడతాయి మన ప్రయాణాలు.

**ఇంతకూ ఎక్కడికెళ్దాం...?!**

మన రాష్ట్రంలో మన చుట్టుపక్కల అనేక పర్యాటక ప్రాంతాలున్నాయి. రాజధాని భాగ్యనగరంతో పాటు విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కర్నూలు వంటి ప్రదేశాలు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. కోస్తా ప్రాంతాలకు చెందిన వారంతా భాగ్యనగరం వైపు, ఇతర చుట్టుపక్కల ప్రాంతాలవైపు దృష్టి పెడుతుంటే ఇక్కడి వారంతా దక్షిణాదిన ఉన్న తిరుపతి, తదితర ప్రాంతాల వైపు ప్రయాణం అవుతున్నారు. ఇక మన ఆర్థిక స్తోమతను బట్టి మనం వెళ్లే ప్రదేశాన్ని ఎంపిక చేసుకోవచ్చు.

వినోదాన్ని విజ్ఞానాన్ని అందించే యాత్రలకు పిల్లలను ప్రోత్సహించటం ద్వారా వారి మనో వికాసానికి దోహదం చేసిన వారం అవుతాం. ఈ పర్యటనలతో వారికి ఆలోచనా పరిధి పెరిగి లోకానుభవం కూడా సమకూరుతుందన్న మాట అక్షరసత్యం. ఈ పర్యటనల ద్వారా మన చరిత్రను, తద్వారా మనల్ని మనం తెలుసుకునేందుకు వీలు ఏర్పడుతుంది. ★

చేసుకోవచ్చు. ఈ మసీదు మధ్యభాగాన్ని మక్కా నుండి తెచ్చిన ఇటుకలతో నిర్మించారు. ఇది హైదరాబాద్ చరిత్రలో చెరిగిపోని మరో అపురూప కట్టడం. ఇవే కాకుండా గోల్కొండ కోట కూడా అద్భుతంగా ఉంటుంది. ఇటీవల కాలంలో లుంబినీపార్కులో లేజర్‌షో కూడా పెట్టారు. ఇక్కడ నుండి హుస్సేన్‌సాగర్‌లో విహరించేందుకు బోట్లు కూడ ఉన్నాయి. వేసవిలో నగరానికి వచ్చినవారు షాపింగ్ చేసేందుకు మరో అద్భుత ప్రాంతం లాడ్‌బజార్. ఇక్కడ అందమైన గాజులు, హైదరాబాద్ మంచి ముత్యాలు, హైదరాబాద్ రాళ్ళతో పొదగబడిన లక్కగాజులు లభిస్తాయి. ఇది చార్మినార్‌కు ఆనుకునే ఉంటుంది. ఇదికాకుండా భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు నిలయంగా ఉన్న శిల్పారామం మరో అద్భుత ప్రదేశం. ఇక్కడ పల్లెప్రాంత వాతావరణం విదేశీయులను సైతం ఆకట్టుకుంటుంది. దీనిని సందర్శించేవారి కోసం శిల్పారామంలోనే షాపింగ్‌సెంటర్ కూడా ఏర్పాటు చేశారు. ఇది హైటెక్‌సిటీ పక్కనే ఉంటుంది. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో నగరంలో పర్యటించేందుకు ఇటీవల ఎసి బస్సును కూడా ప్రవేశపెట్టారు. ఇది రోజుకు మూడు ట్రిప్పులు తిరుగుతుంటుంది. ఈ ట్రిప్పులో అన్ని పర్యాటక కేంద్రాలను చూపిస్తారు. ఒకటి రెండు ట్రిప్పుల్లో పెద్దలకు 125 రూపాయలు, పిల్లలకు 75 రూపాయలు వసూలు చేస్తారు. మూడో ట్రిప్పుకు పెద్దలకు 99 రూపాయలు, పిల్లలకు 75 రూపాయలు వసూలు చేస్తారు. ఇది పర్యాటకులకు కొంత సౌకర్యవంతంగా ఉంటుంది.

–వల్లభనేని సురేష్, రామ్మోహన్ హైదరాబాద్




# వేసవిలో ఆహ్లాదాన్ని పంచే కృష్ణాతీరం

విజయవాడ నగరంలోని కనకదుర్గ దేవాలయంతో పాటు ఉండవల్లి గుహలు, గాంధీ పర్వతం, భవానీ దీవులు, విక్టోరియా మ్యూజియం, రాజీవ్‌గాంధీ పార్క్, గుణదల మేరీమాత ఆలయం, ప్రకాశం బ్యారేజి, మొగల్రాజపురం గుహల వంటి పలు ఆకర్షణీయ ప్రదేశాలున్నాయి. పర్యాటక శాఖ పెద్దలకు 175 రూపాయలు, పిల్లలకు 140 రూపాయల వంతున లోకల్ టూర్ ప్యాకేజీలను నిర్వహిస్తోంది. కొద్దిపాటి దూరంలో వుండే మంగినపూడి బీచ్, హంసలదీవి సూర్యదేవాలయం, కూచిపూడి, ఘంటసాల, వంటి ప్రదేశాలు పర్యాటక స్థలాలుగా పేరుపొందాయి. విజయవాడ నుండి మంగినపూడికి పర్యాటక సంస్థ రెండు రోజులపాటుండే టూర్ ప్యాకేజిని నిర్వహిస్తోంది. పెద్దలకు 130 రూపాయలు, పిల్లలకు 100 రూపాయలు ఛార్జి వసూలు చేస్తారు. విజయవాడ నుండి శ్రీశైలానికి పెద్దలకు 500, పిల్లలకు 400 రూపాయల వంతున ఛార్జీలు వసూలు చేస్తున్నారు. రెండు రోజులపాటుండే ఈ టూర్‌లో శ్రీశైల మల్లికార్జునుని సందర్శించటంతో పాటు సాక్షి గణపతి దేవాలయం, శ్రీశైలం డ్యాం, పాతాళ గంగ, పాలధార, పంచధార వంటి ప్రదేశాలను చూసే వీలుంది. గుంటూరు



జిల్లాలోని పర్యాటక కేంద్రాలయిన అమరావతి, కోటప్పకొండ, నాగార్జునసాగర్ వంటి ప్రదేశాలకు కూడా విజయవాడ నుండి టూరిస్టు సర్వీసులను నిర్వహిస్తోంది. దీనితో పాటు విజయవాడ నుండి అన్నవరంకు కూడా టూర్ ప్యాకేజిని పర్యాటక సంస్థ నిర్వహిస్తోంది. కృష్ణానదిలో బోటు షికారు ఒక్కటే కొంత ఊరట. ప్రకృతి అందాలతో అలరారే భవానీ ద్వీపం ప్రస్తుతం యాత్రీకులకు ఆహ్లాదాన్ని పంచుతోంది. కృష్ణానదిలో ఉన్న విజయసిరి, బోధిసిరి(ఎసి) బోట్లలో స్నాక్స్ కూడా అందచేస్తారు. గంటకుపైగా ప్రకృతి అందాలను తిలకిస్తూ చేసే నదీవిహారం యాత్రికులకు ఆహ్లాదం కలిగిస్తుంది. బోటు షికారు ధరలు కూడా మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండటంతో వీటికి ఆదరణ పెరిగింది. సాయంవేళలలో ఆహ్లాదం పొందేందుకు ప్రజలు ఎక్కువగా ప్రకాశం బ్యారేజీ, రాజీవ్‌పార్కును ఆశ్రయిస్తారు. కార్పొరేషన్‌కు చెందిన పార్కులు నాలుగైదు మినహా మున్సిపల్ కార్పొరేషన్, సిబార్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సిబార్ డిస్నీలాండ్ కూడా సందర్శకులు లేక వెలవెల పోతోంది.

–దాళా రమేష్ బాబు

*ఉదయం ఆరుగంటలవుతోంది. ఆ పాటికే ఖమ్మం బస్ స్టాండంతా ప్రయాణీకులతో కిట కిటలాడుతోంది.*

*ఐదు గంటల్నుండే నీళ్ళపైపుతో బస్టాండంతా శుభ్రంచేసి బ్లీచింగ్ పౌడర్ చల్లిన తుకారామ్ పైపును చుట్ట చుట్టి జంట్స్‌టాయ్‌లెట్స్‌లో ఓ మూలకు పడేస్తూ... "అరే! ఓ జంగ్లీ! ఏంజేస్తున్నవ్? అటుపక్క బ్లీచింగ్ పౌడి జల్లినవా? లేదా? ఒక బకెట్ తీసుకపొయ్యి అటుబెట్టుకో, రెండూ ఇక్కడే ఎందుకు?" వాళ్ళదైన 'క' భాషలో అన్నాడు అవతలిపక్క లేడిస్ టాయిలెట్స్‌లో కూర్చున్న భార్య జంగ్లీబాయితో.*

శిరంశెట్టి కాంతారావు

# పాయఖానా పోయె...టాయిలెట్లు వచ్చె

"కవి కప్పు కడో కజకల్లికన, కవాకసకనొకస్తకలే" తనూ 'క' భాషలోనే భర్తకు సమాధానం ఇచ్చింది. జంగ్లీబాయి నోట్లో పాన్ బిడాను కచాపిచా నములుతూనే...

"లేడీసెవ్వరు లేరుగా ఆ కిష్టా ఓటల్‌కెళ్ళి బొయ్యి నువ్వో 'బన్ను' తిని, 'టీ' తాగి నాగ్గూడ జల్దిపట్రా పో..." జేబులోనుండి బీడీకట్ట, అగ్గిపెట్టె బైటికి తీస్తూ అన్నాడు తుకారామ్.

"అట్లనే..." అంటు కృష్ణా హోటల్ ముందున్న 'టీ' బండివైపు కదిలింది జంగ్లీబాయ్.

తుకారామ్‌కి యాభైఏండ్లుపైనే ఉంటాయి. సన్నగ ముడతలు పడ్డ పాలియెస్టర్ పంచె కట్టుకొని, దాని మీద ఎర్రలాల్చీ తొడుక్కున్నాడు. కాళ్ళకు ప్లాస్టిక్ బూట్లు వేసుకున్నాడు.

పాన్ బిడాలు తినీ, తినీ... మంగళూరు బీడీలు తాగీ, తాగీ అతని పండ్లన్నీ గారపట్టి పొయ్యాయి. ముఖంమ్మీద మీసాలూ, గెడ్డం తెల్లగా రఫ్‌గా పెరిగి ఉన్నాయి.

టాయిలెట్స్‌కి వచ్చిపోతున్న ప్రయాణీకులను పరికిస్తూ కూర్చున్నాడు తుకారామ్.

"బన్నిగో, 'టీ' సల్లారుద్ది జల్దిదిను" అంటూ తీసుకొచ్చిన బన్ను ప్యాకెట్ 'టీ' గ్లాస్ భర్త కందించింది జంగ్లీబాయ్.

జంగ్లీబాయి వయసెంతుంటుందో చెప్పలేం గాని, చూడ్డానికి మాత్రం భర్తకంటే కొంచెం వయసు మళ్ళిన దాన్లా కన్పిస్తుంది. కుడిపైట వేసుకున్న పాలిస్టర్ చీరకొంగు తలమీద కప్పుకుంది. మధ్యపాపిట్లో కొంచెంగానూ, నుదుటిమీద పాత రూపాయి బిళ్ళంత పెద్దగానూ సింధూరం రంగు కుంకుమ బొట్లు పెట్టుకుంది. ఎంబ్రాయిడరీ చేసిన పొడుగు చేతుల 'బ్లూ' జాకెట్ తొడుక్కుంది. మోచేతులదాకా మట్టిగాజులు వేసుకుంది. పాన్‌బిడా ఉన్న అరలరల గుడ్డసంచి ఎడంపక్క బొడ్లో దోపుకుంది. ఆమె మాట్లాడుతుంటే గారపళ్ళ సందుల్లో నుండి తుంపర్లు పడుతున్నాయి. వెండి కడియాలేసుకున్న ఆమె తెల్లటి కాళ్ళమీద నల్లటి కాయలు తేలాయి.

భార్య అందించిన బన్నును చిన్న, చిన్న ముక్కలుగా చేసి 'టీ'లో ముంచుకొని తింటూ "అవతల గిరాకొచ్చినట్టుంది చూడు పో..." అన్నాడు తుకారామ్ భార్యతో.

* * *

పాల్వంచ నుండి వచ్చిన బస్సు దిగిన గంగాధర్ గబ, గబా టాయిలెట్స్‌వైపు నడిచాడు. అప్పటికే 'క్యూ' ఉండడంతో గంగాధర్ కూడా వెళ్ళి వరుసలో నిల్చున్నాడు.

యూరినల్ బేసిన్స్‌కి, టాయ్‌లెట్ మధ్య ఖాళీ స్థలంలో ఓ మూలకి నాసిరకం చెక్కటేబుల్ ముందు, ప్లాస్టిక్ కుర్చీలో మూని పోయిన దిండుమీద కూర్చున్నాడు తుకారామ్. కుళ్ళిన మాంసం తింటున్న సిద్ధయ్యలా అక్కడి దుర్గంధాన్ని భరిస్తూ ప్యాసింజర్లిస్తున్న చిల్లరను టేబుల్ మీద కుప్పలా వేసుకోసాగాడు.

టాయ్‌లెట్లో నుండి బయటికొచ్చిన ఓ యువకుడు తుకారామ్ టేబుల్ మీద ఓ అర్ధరూపాయి బిళ్ళను నిర్లక్ష్యంగా గిరాటేసి వెళ్ళబోయాడు.

"ఇంకా అర్ధరూపాయివ్వు" అన్నాడు తుకారామ్.

"ఎందుకివ్వాలి? అక్కడ జూడు ఏం రాసుందో!?" 'మరుగుదొడ్లను ఉపయోగించుకున్నవారు అర్ధరూపాయ మాత్రమే చెల్లించండి' అని ఆర్.టి.సి. వారు రాసిపెట్టిన బోర్డు వంక చూపిస్తూ... అన్నాడా యువకుడు.

ఎడంచేత్తో గడ్డంమీద బరుక్కుంటూ... "మందేవూరు బాబూ! ఖమ్మంరాక ఎన్నేళ్ళైందేంది? పొద్దున్నే ఏం రూల్లు మాట్లాడ్తవ్‌గాని పైసల్‌దియ్" రఫ్‌గా మాట్లాడాడు తుకారామ్.

'ఆఫ్ట్రాల్ మరుగుదొడ్లు కడుక్కునేవాడు ఇంతమంది ముందు నన్ను ఇన్‌సల్ట్ జేసినట్లు మాట్లాడుతాడా!' అనుకున్న ఆ యువకుడు "నేనంతే ఇస్తా. ఏంజేసుకుంటావో చేసుకోపో... గట్టిగా మాట్లాడావంటే స్టేషన్ మేనేజర్‌కి కంప్లయింట్ జేస్తా ఏమనుకున్నావో! ఏమో" అన్నాడు.

"అరే! నేనేంజేస్తతియ్ సార్! చేసేవాణ్ణైతే ఈ దొడ్లెందుగ్గడుక్కుంటా!? ఇర్వై నాలుగ్గంటలు ఈ ఉచ్చల్ల గూసుంటే వచ్చే పైసలు గవర్మెంటోడికి కట్టడానికే సాలట్లే. ఈ వాసనకు ముక్కులు పన్జేసుడు ఎప్పుడో బందైంది. తిందామంటే నోట్లోకి ముద్ద దిగదు ఎరికేనా?" కొంచెం సముదాయించినట్టుగా మాట్లాడాడు తుకారామ్.

"అంతకష్టమైతే మానెయ్. ఇంకోడొస్తాడు. అంతేగాని ఎక్కువెందుకిస్తాం?" మేనేజర్‌కి కంప్లయింటిస్తాననే సరికి మెల్లగా కాళ్ళ బేరానికొస్తున్నాడు వెధవ అనుకున్న యువకుడు తుకారామ్‌ను దబాయిస్తున్నట్టుగా అన్నాడు.

దాంతో చిర్రెత్తుకొచ్చిన తుకారామ్ "ముందు పైసలిచ్చి కదులుబే! రోజుకు పుట్టెడు గలీజు బాగుజేసెటోణ్ణి, నా పైసల్ నాకియ్యుమంటె, ఏందో నఖ్రాల్ జేస్తున్నవ్?! నీ అసంటోల్లను రోజుకు ఇంతమందిని జూస్తున్నా!" అంటు గడ్డం మీది వెంట్రుకలు చూపించాడు తుకారామ్.

"ఏంటీ!? నాకు బొచ్చుచూపిస్తావా? నిన్నేంజేస్తానో చూడు" అంటు ఆ యువకుడు తుకారామ్ మీదికి దూసుకొచ్చాడు.

"ఏంజేస్తావ్?" అంటూ లేచి నిల్చున్నాడు తుకారామ్ కూడా ఫైటింగ్‌కి సిద్ధమౌతూ...

"ఇదుగో బాబూ! పొద్దున్నే ఆ కుర్రాడితో గొడవెందుగ్గాని ఇదుగో ఇందులో తీసుకో"... అంటు పదిరూపాయలనోటు టేబుల్ మీద పెట్టాడు టాయిలెట్లో పనిముగించుకున్న గంగాధర్.

ఆ మాటలు విన్న కుర్రాడు "నా డబ్బులు మీరెందుకు సార్ ఇయ్యడం. నా దగ్గర లేకకాదు. వీళ్ళ రుబాబు చూస్తే వళ్ళు మండి అడుగుతున్నాను గానీ..." అని బ్యాక్ ప్యాకెట్ నుండి మిగతా చిల్లరతీసి "ఇదిగో! తీసుకోపో..." అంటు తుకారామ్ టేబుల్ మీద విసిరేశాడు.

"ఇదేదో ముందునే ఇస్తే... ఈ గోలంత ఉండేదికాదుగా..." డబ్బులు తీసుకొని చిల్లరకుప్పలో కలుపుకుంటూ అన్నాడు తుకారామ్ వెళ్ళిపోతున్న యువకుడితో.

ముదిగొండ నుండి వస్తానన్న తన మిత్రుడు రాకపోవడంతో అక్కడే ఉన్న చెక్కబల్ల మీద కూర్చున్నాడు గంగాధర్.

ఓ పావుగంట తరువాత మంగుళూరు బీడికట్ట కొనుక్కుని వస్తూ... బల్లమీద కూర్చున్న గంగాధర్ వంక జూస్తూ "ఏందిసాబ్! బస్సింకా రాలే" అడిగాడు తుకారామ్.

"ఇంకా రాలే!... గిరాకైపోయిందా ఏంటి?! బయటికొచ్చావ్!" అన్నాడు ఫ్రిలాన్స్ జర్నలిసు గంగాధర్.

"ఇప్పుడే మా మనవడొస్తే... వాన్నుంచి బీడీలు కొనుక్కుందామని ఇటొచ్చినసార్!" రెండు అరచేతుల మధ్య బీడీకట్ట నుంచి రాపాడుతూ అన్నాడు తుకారామ్.

"నువ్వీపని చెయ్యబట్టి ఎన్నేండ్లైంది?" ప్రశ్నించాడు గంగాధర్.

వేళ్ళులెక్క బెట్టుకుంటూ "నలభై నలభైఐదేండ్లైతుందిసాబ్!" చెప్పాడు తుకారామ్.

"అంటే! చిన్నప్పట్నుండి ఇదే పనన్నమాట!" కుతూహలంగా అడుగుతూ... తన పక్కనే కూర్చోమన్నట్టుగా పక్కకు జరిగి చోటు చూపించాడు గంగాధర్.

ఈ సాబ్! బలే మంచోడున్నట్టుంది! పాకోన్ని పక్కన కూసోబెట్టుకొని మాట్లాడే మనిషిని ఇయ్యాల్నే జూస్తున్నా!" అనుకుంటూ గంగాధర్ పక్కన బల్లమీద చివర ఆనీ, ఆననట్టు కూర్చున్నాడు తుకారామ్.

గంగాధర్ అడిగాడనే కాదు గానీ తుకారామ్ గతం నిజానికి ఒక గాథే.

❊ ❊ ❊

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కొద్ది రోజులకు జరిగిన ఎన్నికల్లో గెలిచిన ఎమ్.పి. అచ్చుతరామయ్య ఖమ్మం పట్టణ పర్యటనకొచ్చాడు. ఢిల్లీ నుండి వచ్చిన అచ్యుతరామయ్యను రైల్వేస్టేషన్ నుండి పెద్దఎత్తున ఊరేగింపుగా తీసుకొస్తున్న జీపులో తన పక్కనే కూర్చున్న మిత్రునితో "కులానికీ పాకీవాడైనా స్వతంత్రపోరాటంలో మనందరికన్నా ఎక్కువగా పన్జేసి ఎముకలు విరగబొడుస్తున్నా లెక్క చెయ్యక ఖమ్మం ఖిల్లా ముందు జండా ఎగరేసిన 'ఘనీరావ్' ఎలాగున్నాడయ్యా!" అంటు ప్రశ్నించాడు.

ప్రజాసేవలో ఘనీరామ్‌ను ఎప్పుడో మర్చిపోయిన అచ్యుతరామయ్యగారి మిత్రుడు ఒకింత ఇబ్బంది పడుతూ "ఇప్పుడే తెలుసుకుందాం" అన్నాడు సంజాయిషీగా.

"ఫర్వాలేదు. ఫర్వాలేదు. నేనే స్వయంగా సఫాయి బస్తీకెళ్ళి ఘనీరామ్‌ని కలుసుకుంటాలే" అన్నాడు ఎం.పి. అచ్యుతరామయ్య ఇంకా కల్మషం ఒంటబట్టని శుద్ధగాంధేయవాదిగా.

అచ్యుతరామయ్యగారి ఖమ్మం పట్టణ సందర్శన సఫాయి బస్తీతోనే మొదలైంది.

ఎం.పి. అచ్యుతరామయ్యగారు వెతుక్కుంటూ తన గుడిసెకు రావటంతో ఆనందం పట్టలేక ఉక్కిరిబిక్కిరైన ఘనీరామ్ "ఏందిబాబూ! పిలిస్తే నేనే వద్దునుగదా!" నొచ్చుకుంటున్నట్టుగా అన్నాడు.

"అదేంటి?! ఘనీరామ్! ఎవరింటికి ఎవరొస్తేనేం?! నీ ఇంటికి నేను రాకూడదా?"

"అయ్యో! అదే మాటబాబూ!" సిగ్గుతో మరింత ముడుచుకుపోతూ అన్నాడు ఘనీరామ్.

"సర్లే! చూడూ! వచ్చే పంద్రాగష్టునాడు ఇక్కడ కడుతున్న బస్‌స్టాండు ప్రారంభం కాబోతుంది. గాంధీగారికి అత్యంత ఇష్టమైన పని సఫాయి పని. కన్నవారి తరువాత ఇతర్ల మల మూత్రాలను శుభ్రంచేసే వ్యక్తి సపాయివాడే కాబట్టి ఆ వృత్తినీ, ఆ వృత్తిదారులైన పాకీవారిని గౌరవించడం మన సంస్కారానికి నిదర్శనం అంటూ ఆయన ఎన్నోసార్లు పేర్కొనేవారు. అందుకే నేనో నిర్ణయం తీసుకున్నా..." అంటూ ఘనీరామ్ భావాలెలా ఉన్నాయో పరిశీలించడానికా!? అన్నట్టుగా ఆగారు ఎం.పి.గారు.

"ఈ ఊళ్ళో కొత్తగా కడుతున్న బస్‌స్టాండ్‌లో మరుగుదొడ్లు శుభ్రం జేసేపని తీసుకో...నీ కుటుంబానికి ఓ ఆధారం దొరుకుతుంది. స్వతంత్రపోరాటంలో కాలుపోగొట్టుకున్న నీకు ప్రస్తుతం ఈ సాయం చెయ్యాలనుకున్నా. అదీ నీకిష్టమైతేనే సుమా." తానొచ్చిన అసలు విషయాన్ని వివరించాడు ఎం.పీ.

"అంతకంటే ఇంకేం కావాలిబాబూ! ఈ పాకీవాణ్ణి గుర్తుంచుకొని, స్వయంగా మీరే నా ఇంటికొచ్చి బతుకుదెరువు చూపిస్తానంటే వద్దంటానా!?" ఉద్వేగంతో కదిలిపోతూ అన్నాడు ఘనీరామ్.

"చూడు ఘనీరామ్! మనమంతా తెల్లదొరల్ని ముఖాముఖి ఎదిరించి స్వరాజ్యం సంపాదించుకున్నాం. దీని ఫలితాన్ని మనందరం సమానంగా అనుభవిద్దాం." అంటూ ఘనీరామ్ భుజంతట్టి "మళ్ళీ కలుద్దాం" అంటూ ముందుకు సాగారు అచ్యుతరామయ్యగారు.

❊ ❊ ❊

బండి ఇరుసులో చక్రంలా సంవత్సరాలు దొర్లిపోయ్యాయి.

ఘనీరామ్ పోయింతరువాత అతని కొడుకు తుకారామ్ తండ్రి స్థానంలో మురుగుదొడ్లు శుభ్రం చేస్తూ బతుకు బండిలాక్కొస్తున్నాడు.

ఒకరోజు...

"నిన్ను డి.యమ్.సాబ్ రమ్మంటుండు" డి.యమ్.ఆఫీస్ నుండొచ్చిన అటెండర్ చెప్పాడు తుకారామ్‌తో

"డి.యమ్. సాబ్‌కి నాతో ఏం పనబ్బా!" ఏదో తెలియని అనుమానం మనసులో కదలాడుతుంటే వెళ్ళి డి.యమ్. ముందు చేతులు కట్టుకొని నిల్చున్నాడు తుకారామ్.

"బస్టాండ్‌లో ఉండే తుకారామ్ నువ్వేనే?" కళ్ళద్దాల్లో నుండి తొంగిచూస్తూ అడిగాడు. డి.యమ్.

"జి సాబ్!" మరింతగా వినయంతో ఒదిగిపోతూ అన్నాడు తుకారామ్.

"చూడు తుకారామ్. ఇన్నేళ్ళుగా మీరు మరుగుదొడ్లు శుభ్రం చేస్తున్నందుకు ఆర్.టి.సి. నెల నెలా డబ్బులిస్తూ వస్తుంది. కానీ, ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. ఆర్.టి.సి. డబ్బులివ్వకుండా టాయ్‌లెట్స్ దగ్గరకొచ్చిన ప్యాసింజర్ల దగ్గర తలో పావలో, బేడో వసూలు జేసుకోమని ఆర్డర్స్ వచ్చాయి. అప్పుడు మేమిచ్చిన దానికంటే ఎక్కువే వస్తాయి" ఆపద్భాంధ వుడిలా ఫోజ్‌పెడుతూ అన్నాడు డి.యమ్.

"పావలా పైసలంటే ఎవరిస్తార్ సాబ్!" తన మనసులోని సందేహాన్ని వ్యక్తపర్చాడు తుకారామ్.

"చచ్చినట్టిస్తారయ్యా! నీకెందుకా అనుమానం. అవసరమలాంటిది. ఇవ్వడమే గాదు. ఈ దెబ్బతో నీకు నాలుగుపైసలు గూడా వెనుకబడతాయ్... సరేనా!" నేను చెప్పినట్టు చెయ్యక తప్పదన్నట్టు అన్నాడు డి.యమ్.

"సరే సాబ్! మీరు చెప్పినట్టే చేస్తా" అన్నాడు తుకారామ్ అంతకన్నా ఏంచెయ్యలేక.

ఆ విధంగా రాష్ట్రవ్యాప్తంగా ఆర్.టి.సి. తీసుకున్న కొత్త నిర్ణయం అమల్లోకొచ్చింది. కాలం అలుపెరగని పందెం గుర్రంలా పరుగులు తీస్తూనే ఉంది...

❊ ❊ ❊

హఠాత్తుగా ఒకరోజు...

డిపోలోనూ, బస్‌స్టాండ్‌లోనూ ఉన్న నోటీస్ బోర్డుల్లో "కార్పొరేషన్ ఉత్తర్వుల ప్రకారం రాష్ట్రంలోగల అన్ని బస్‌స్టాండ్‌ల్లో ఉన్న మరుగుదొడ్ల నిర్వహణకుగాను ఒక సంవత్సరకాలానికి కోట్ చేసిన సీల్డ్ టెండర్లు ఆహ్వానించబడుతున్నాయి" అని పిడుగులాంటి సర్క్యులరొకటి పెట్టారు.

మనిషి కొట్టినదెబ్బకు వెన్నుపూసలు కదిలిపోయిన కొండచిలువలా అయిపోయాడు తుకారామ్ ఆ సర్క్యులర్ చూడగానే. "ఎందుకైనా మంచిది డి.యమ్. సాబ్‌ను కల్సిరాపో..." అంటు భర్తను పంపించింది జంగ్లీబాయి.

డియమ్ ఛాంబర్‌లోకి అడుగుపెట్టిన తుకారామ్‌ను చల్లటి మృత్యుస్పర్శలా 'జిల్లు' మంటూ చుట్టేసింది ఎ.సి.గాలి.

"ట్రింగ్..." మంటు మళ్ళీ ఫోన్ రింగవ్వడంతో ఫోనెత్తి మాట్లాడసాగాడు డి.యమ్.

తనవైపైనా చూడకుండా ఫోన్ మాట్లాడుతున్న డి.యమ్.కి వినయంగా రెండు చేతులూ జోడించి దండం పెడుతూ తుకారాం ఆ ఆఫీస్‌నంతా పరిశీలించసాగాడు... ఆఫీస్ మధ్యలో పెద్దపొడవాటి టేబుల్. దాని మీద ఓమూలకు కంప్యూటర్. మరోమూల నాలుగు ఫోన్లు. టేబుల్ వెనుక పెద్ద కుర్చీలో కూర్చున్న డి.యమ్. టేబుల్ చివర రోజాపూల ఫ్లవర్‌వాజ్. గోడల మీద అందమైన బొమ్మల ఫొటోలు. ఓమూలకి తళ,తళా మెరుస్తున్న వాష్ బేసిన్. ఇవన్నీ బైటికి కన్పించకుండా కిటికీ అద్దాల్ని మూసేస్తూ ఖరీదైన పరదాలు. "అబ్బో! అప్పటికీ, ఇప్పటికీ డి.యమ్.సాబ్ ఆఫీస్ ఎంత మారిపోయిందో" అనుకుంటూ తుకారాం డి.యమ్.కేసి చూడసాగాడు.

ఫోన్ పెట్టేసిన డి.యమ్. "ఆఁ ఏంటోచెప్పు" అన్నట్టు తుకారామ్ వైపు చూశాడు.

తన బతుకంతా డి.యమ్. ముందు పరిచేశాడు తుకారామ్.

"నేనేం చేస్తాను?! ఆర్.టి.సి. ఆదాయం పూర్తిగా పడిపోయింది. తనను తను నిలబెట్టుకోడానికి కార్పొరేషన్ పాత పద్ధతులన్నీ మార్చేస్తోంది. దానికి తగ్గట్టు అందరం మారాల్సిందే తప్పదుమరి." హితోపదేశం చేశాడు డి.యమ్.

"ఏం మారాలి సాబ్! మాకు పుట్టినప్పట్నుండి ఇదేపని. ఇంకో పనేది తెల్వదు. మరిప్పుడా పనిగూడా లేకుంటే మేం బతికేదెట్లా!?" డి.యమ్. ముఖంలోకి దీనంగా చూస్తూ అన్నాడు తుకారామ్.

"ఐతే ఎప్పట్నుండో ఇక్కడే చేస్తున్నావ్ కాబట్టి ఓ సహాయం మాత్రం చెయ్యగలను" కావాలని జోవోలో సగం దాచిపెట్టిన అన్నాడు డి.యమ్.

"ఏందో! చెప్పండిసాబ్!" ఆతృతగా అడిగాడు తుకారామ్.

"నువ్వైతే ముందు టెండర్ వెయ్యి. నీ సీనియారిటీని చూపించి నెగోషియేషన్స్‌లో నీకే వర్క్ ఇచ్చేలా చూస్తాను." కుర్చీవెనక్కి జారగిలబడుతూ అన్నాడు డి.యమ్. తుకారామ్‌తో ఇక వెళ్ళమన్నట్టుగా.

❊ ❊ ❊

"అగో! అప్పట్నుంచి తిమ్మిని, బమ్మిని జేసుకుంట కాంట్రాక్ట్ సంపాయించి నెట్టుకొస్తున్నాంసాబ్! పాకిదొడ్లు గడుక్కునే మాలాంటోళ్ళకాడ గూడా ఆఫిసర్లు నెల నెలా మామూళ్ళు వసూలుజేసుకుంటారు. వాళ్ళ మామూళ్ళ వాళ్ళకియ్యాల, మా కుటుంబాలు బతకాల మరి. వాళ్ళు రాసినట్టు ప్యాసింజెర్‌కి అర్ధరూపాయ దీసుకుంటే మేం బతికే దెట్ల. మీరే జెప్పండి." అంటూ తన గతమంతా చెప్పుకొచ్చాడు తుకారామ్ గంగాధర్‌తో.

"ఔను తుకారామ్! ఇప్పుడు ప్రపంచం తీరే మారిపోయింది. మీ తండ్రి కాలంలో ఉన్న అచ్యుత రామయ్య వంటి నాయకులకు, ఇప్పటి నాయకులకు అసలు సంబంధమే లేదు. ఏదైనా సరే నీది నీకు దక్కాలంటే ఎదిరించి అడగకతప్పని పరిస్థితులొచ్చాయి" సాలోచనగా తుకారామ్ వంక చూస్తూ అన్నాడు గంగాధర్

"ఎవర్నెదిరించాల సాబ్! అసలిదంతా ఎవడు చేయిస్తుండో కంటికి కన్పిస్తేగా?! మా అయ్యకాలంలో తెల్లోడిలెక్క ఎవడోఒకడు కళ్ళబడితే గదా! సావో, రేవో తేల్చుకోడానికి" అంటున్న తుకారామ్ కళ్ళలో మేడే నాడు ఎగిరే జెండా అంతటి ఎరుపు జీరలు కనబడ్డాయి గంగాధర్‌కు. ★

# ఇదేమి పని సంస్కృతి!

ముదిగంటి సుజాతారెడ్డి

పిపిఎఫ్‌లో నుంచి డబ్బు తీసుకుందామని బ్యాంకుకు వెళ్ళాను. బ్యాంకులో ఎప్పటి లాగానే రష్‌గా వుంది. కంప్యూటర్లు ఎక్కువగా కన్పించాయి. ప్రతి బ్యాంకు ఉద్యోగి ముందొక కంప్యూటరు వెలిగిపోతున్నది. అరే! ఇంతకుముందు ఇన్ని కంప్యూటర్లులేవే ఈ బ్యాంకులో అనుకున్నాను.

ఉద్యోగుల స్థలాలన్నీ మారాయి. ఇద్దరు ముగ్గుర్ని అడిగింతర్వాత పిపిఎఫ్ వ్యవహారాలు చూసే ఉద్యోగిని దొరికించుకున్నాను. అతని చుట్టూ పదిమంది పెన్షన్ వాళ్ళు, అప్పులకు దరఖాస్తులవాళ్ళు వగైరా వగైరా. ఊరికెనే నిలబడితే పనికాదని ఒకరిద్దరి తలకాయల మీది నుంచే – "సార్! పిపిఎఫ్ నుంచి డబ్బు తీయాలి. ఫార్మ్ వుంటే ఇయ్యండి" అన్నాను.

ఉద్యోగి పాపం వెంటనే కంప్యూటర్ తెరమీది నుంచి కండ్లు పైకెత్తి నా ముఖంలోకి శూన్యంగా చూసాడు ఓ క్షణం. తర్వాత రెండు మూడు డ్రాయర్లు వెతికి ఫార్మ్ నా చేతికిచ్చాడు. నేను ఆ ఫార్మ్‌ను నింపి అతనికిచ్చాను. ఇంకా అతని చుట్టూ కొత్తగా మరో ఐదుగురు. నాకు అతన్ని చూసి పాపం అనిపించింది.

"ఏమైంది సార్! ఇంతకు ముందు నాకు పిపీఎఫ్ డబ్బు తీసుకోవటం ఐదు నిమిషాల్లో జరిగిపోయేది. ఇప్పుడు ఆలస్యం ఏమిటి" అడిగాన్నేను.

"అదేనమ్మా! కంప్యూటర్లు వచ్చాయి..."

"కంప్యూటర్లు వస్తే పని తొందరగా చకచక నడవాలి గద సార్!" అన్నాన్నేను.

"నిజమే! కాని... కంప్యూటర్లు మాకు కొత్తకద! టైమ్ పడ్తుంది. రెండు కోట్లు ఖర్చుపెట్టి కంప్యూటర్ సిస్టమ్ పెడ్తున్నారు. మీరు మీ పిపీఎఫ్ ఈసారి ఎక్కడైనా ఏ బ్రాంచిలోనైనా చివరకు విజయవాడ, విశాఖపట్నంలోనైనా తీసుకోవచ్చు" అన్నాడు ముఖం మీద నవ్వు తెచ్చుకొని. వెంటనే అతను కంప్యూటర్ తెరమీది అక్షరాలు' అంకెల్లో మునిగిపోయాడు.

మొత్తంమీద నా ఫార్మ్‌ను ఇంకొక ఉద్యోగి దగ్గరికి పంపించి చెక్కు తయారు చెయ్యమన్నాడు.

"అదేంటి! ఇంతకు ముందు క్యాష్ ఇచ్చేవాళ్ళుగద!" అడిగాన్నేను.

"లేదమ్మా క్యాష్ వీలుకాదు. చెక్కు తయారుచేయటం ఈజీ. చెక్కు తీసుకోండి" అన్నాడు ఉద్యోగి. సరే అని ఆ ఉద్యోగి దగ్గరికి వెళ్ళి నిలబడ్డాను. టైమ్ గడిచిపోతూ వుంది. మళ్ళీ అదే చిరాకు నాకు.

'అదేంటి సార్! పోయినేడు క్షణాల్లో డబ్బు ఇచ్చారు నాకు. ఇప్పుడీ ఆలస్యమేంటి!" అడిగాన్నేను.

'అదేనమ్మా! కంప్యూటర్లు కద! అన్నీ చెక్ చేసుకోవాలె! వీటితోనే కదా కొందరి ఉద్యోగాలు ఊడాయి. మనుషులు తగ్గారు. పని ఎక్కువైంది." అన్నాడతడు హఠాత్తుగా.

అతని నోటి నుంచి ఊడిపడ్డ మాటలు నన్ను చకితురాల్ని చేశాయి. కంప్యూటర్లు వచ్చాయి! పని చకచక నడిచి పోతుంది. ఇద్దరు ముగ్గురు చేసే పనిని కంప్యూటరు సహాయంతో ఒక్కడే చేయగలుగుతున్నాడు. కాని పాత వాసనలు వదలవన్నట్లుగా మన బ్యాంకుల్లో ఆఫీసుల్లో కంప్యూటర్లుండగా మళ్ళీ పాత సిస్టమ్ రికార్డుల్లో వ్రాయటం సంతకాలు తీసుకోవటం వంటి పాత పనులు వుండనే వుంటున్నాయి. దాంతో పాత సిస్టమ్ కొత్త సిస్టమ్‌లు కలిసి పని రెట్టింపు అవుతున్నది. అందులో కంప్యూటర్లు అలవాటు కావాలి. మౌస్ నొక్కినంత వేగంగా కంప్యూటర్ నడువదు. స్పీడ్ తక్కువ. చకచక నడిచే ఇంకా కొత్త కంప్యూటర్లు వచ్చింతర్వాత ఇంకా ఉద్యోగులు తగ్గుతారేమో! అట్లా నిరుద్యోగం పెరుగుతుంది. ఎక్కడైతే జనాభా తక్కువగా వుందో, మ్యాన్ పవర్ తక్కువగా వుందో అక్కడ కంప్యూటర్లు బాగానే వుంటాయి. కాని భారతదేశం వంటి జనాభా గల దేశంలో వీటితో నిరుద్యోగం పెరుగుతూవుంది. మరి దానికి ప్రభుత్వం ఏదైనా మార్గం చూడాలి! ఆలోచిస్తూ ఇంటికి వెళ్ళాను. లలిత వచ్చి నాకోసం ఎదురు చూస్తూ వుంది.

"ఎంతసేపైందే లల్లీ వచ్చి" అడిగాన్నేను.

"అర్థగంటవుతోందిలే. బ్యాంకుకు వెళ్ళావని తెలిసి ఇప్పుడే రావని పేపర్ చదువుతూ కూర్చున్నాను" అంది లలిత.




'ఏం విశేషాలు" అడిగాన్నేను.

'ఏముంది. నిరుద్యోగం, నిరాశ, నిస్పృహలు. ఉద్యోగంవేటలో మా బావ కొడుకు వచ్చాడు" అంది లలిత.

'ఓహో ఏమైనా ఫలించిందా వేట"

'ఎక్కడ ఫలిస్తుంది ఇదిగో? ఈ వార్త చూసావా... జర్మనీలో కార్లు తయారు చేసే పరిశ్రమలో పనివేళలను వారానికి ముప్పైఐదు నుంచి నలభై వరకు పెంచి ఉద్యోగులను తగ్గించాలని చూస్తున్నారట. అంటే కొత్తవాళ్ళకు ఉద్యోగాల్లేవు. వున్న వాళ్ళకు పనిఒత్తిడి! స్ట్రెస్ స్ట్రెయిన్‌లతో పనిచేయటం అమెరికన్ కల్చర్. మేం దీనికి ఒప్పుకోమని కార్మికులు సమ్మెకు దిగారట" అంది లలిత పత్రిక నాకందిస్తూ.

"ఏమోనే! ఒత్తిడులతో కూడిన పనితో ఎన్నో సమస్యలు తలెత్తుతాయి. మానసికమైన ఒత్తిడి వల్ల మనిషికి సహనం చచ్చిపోతుంది. నవ్వటమే మరచిపోతాడు. ఒకరికి సాయం చేయాలన్నా మంచి మాట మాట్లాడాలన్నా సమయముండదు. ఓపిక వుండదు. నవ్వినా పేలవంగా వుంటుంది. ఇటువంటి ఒత్తిడులే మనిషిని పోట్లాటలకు, ఆత్మహత్యలకు, హత్యలకు ప్రేరేపిస్తుంది!" అన్నాన్నేను సాలోచనగా.

అమెరికన్ సంస్కృతి! ప్రపంచబ్యాంకు అప్పులిస్తూ అన్ని దేశాలమీద ఈ పని సంస్కృతిని రుద్దుతున్నాయి. పనిలో హాయి వుండాలి. ఆడుతూ పాడుతూ చేయగలిగివుండాలి కాని... ఈ ఒత్తిళ్ళు ఏమిటి! మరోవైపు నిరుద్యోగులేమిటి? చెప్పు!" అంది లలిత ఆవేశంగా.

"లల్లీ! నిజమే! ఈ అంతస్తులమీద అంతస్తులను కట్టి నిర్మించే ఆర్కిటెక్చర్ అమెరికాలోనే మొదలైంది. పిట్టగూళ్ళలాంటి ఇండ్లల్లో వుండటం. కరెంటు లైటు వెలగందే వెలుగువుండని చీకటి గుహల వంటి ఆఫీసుల్లో పని చేయటం! ఇదంతా ప్రపంచానికి అమెరికా అందించిన సంస్కృతి! మెసపటోమియా ఈజిప్టు భారత్ చైనా దేశాల సంస్కృతి ఎక్కడ! ఈ అమెరికన్ సంస్కృతి ఎక్కడ! ఏం జేస్తాం కాలం మారింది!" నిట్టూర్చాన్నేను.

★

# కొండమీది కొంగలు

పుప్పాల కృష్ణమూర్తి

నాలుగు కొంగలు ఎప్పుడూ స్నేహంగా వుండేవి. ఎటు వెళ్లినా కలిసికట్టుగా వెళ్తుండేవి. పొలాల్లో పురుగుల్ని, చిరుకప్పల్ని రోజంతా వెదికి తిని సాయంత్రం కాగానే తమ ఇళ్లకు బయలు దేరాయి ఆరోజు. కొద్ది దూరం వెళ్లగానే వాటికి ఒక కొండ కనిపించింది. 'కొద్దిసేపిక్కడ ఆగి విశ్రాంతి తీసుకుని వెళ్దాం' అనుకున్నాయి. వెంటనే అవి ఆ కొండ మీద దిగి అలసట తీర్చుకుంటూ చుట్టూ చూడసాగాయి. కాస్తంత దూరంలో వాటికో చిన్న గుడిసె కనిపించింది. అక్కడ ఒక మొరటు మనిషి కనిపించాడు. అతని చేతిలో తుంగపోచకు గుచ్చిన చేపల దండ వుంది.

"ఆహా! చేపలు..." అంది ఆసక్తి అనే కొంగ.

"ఎప్పుడూ చూడలేదా? ఎందుకంత ఆశ్చర్యపడతావు!!" అంది సుబోధి.

"ఎప్పుడో చూడ్డం వేరు. ఇప్పుడు చూడ్డం వేరు. నిజం చెప్పండి. ఈ మధ్య మనం చేపలు తినక చాలా రోజులు కాలేదా..? నోరు చవి తప్పినట్లుగా వుంది" అంది ఆసక్తి.

"అవుననుకో. మరి చేపలేమో మనిషి చేతిలో వున్నాయి. మనకెలా చిక్కుతాయి?" అంది సుబోధి.

"కోరికంటూ వుంటే ఎలాగైనా తీర్చుకోవచ్చు. అతను దండను నేల మీద పడేసి గుడిసెలోకి వెళ్తాడు. దాన్ని ఎత్తుకుని వెళితే చక్కా తినేయొచ్చు" అంది ఆసక్తి.

"కోరిక వుండటం సహజం. మరి దానిని తీర్చుకోవడానికి సమయం, సందర్భం కూడా వుంటుంది. చీకటి పడుతోంది. అసలే అతను మనిషి. మనకు శత్రువు. ఆ చేపల గురించి ఆలోచించడం మానేసి, ఇంటికెళ్లడం మంచిది అన్నది సుభాషిణి.

"సరేలే...! ఆ చేపలను మనమేం ఎత్తుకు పోవద్దు. కాసేపు ఇలాగే వుందాం. అతనేం చేస్తాడో చూద్దాం" అంది ఆసక్తి.

"సరే ! నీ మాటెందుకు కాదనడం" అన్నాయి మిగిలిన మూడూనూ.

ఆసక్తి ఆ మనిషి వైపే చూడసాగింది. అతను మురికిగా, ముదుసలిలాగా వున్నాడు. పైగా ఒంటరిగా వున్నాడు. గుడిసెలోంచి రెండు రాళ్లు తెచ్చి కొట్టి నిప్పు పుట్టించాడు. ఆ నిప్పును అక్కడ పోగు చేసిన చెత్తకు అంటించాడు. ఆ మంట మీద తను తెచ్చిన చేపల్ని వేశాడు. అవి కాలసాగాయి. మంట ఆరిపోయింది. కాలిన చేపల్ని ఏరి పక్కన పోగు పెట్టుకున్నాడు. తరువాత వాటిని తీరిగ్గా తినసాగాడు.



"అబ్బ చూశారా? ఎంత మధురమైన వాసన వచ్చిందో..?" అంది ఆసక్తి.

"చేపలు కాలితే అలాంటి వాసనే వస్తుంది. చీకటి పడుతోంది. మనం వెళదాం" అంది హితవు.

"నీకెప్పుడూ తొందరే. ఆ మనిషిని పరిశీలించారా? చేపను సగమే తిని, మిగతా సగం పారేస్తున్నాడు. దాన్ని మనం తినేయొచ్చు" అంది ఆసక్తి.



"ఇది సందర్భం కాదు. అదీగాక అతను మనిషి. ప్రమాదకారి. త్వరగా వెళ్లిపోదాం" అంది సుబోధి.

"లేదు. నేను ఆ కాలిన చేపల్లో పారేసిన సగభాగం తినివస్తా. కాలిన చేపలు ఇంతవరకూ మనం తిని ఎరుగం కదా. వాటి రుచి ఎలా వుంటుందో చూడాలి" అంది ఆసక్తి.

" సరే అయితే వుండు. తరువాత నువ్వే బాధపడతావు. మేం వెళ్తున్నాం" అంది సుభాషిణి. మూడూ వెంటనే ఆకాశంలోకి లేచాయి.

ఆసక్తి వెళ్లి అతను తిని పారేసిన చేపల్ని చక్కగా మింగసాగింది. అతను కొంగను చూసి క్రమేపీ తనకు దగ్గరగా వేసుకోసాగాడు చేపల్ని. "ఈ మనిషి చాలా మంచివాడు. అనవసరంగా నా మిత్రులు ఇంత రుచికరమైన మాంసం కోల్పోయారు" అనుకుంటూ చేపల్ని తింటూ మనిషికి దగ్గరగా వెళ్లింది.

* * *

ఆసక్తి కోసం రాత్రి ఎంతో ఎదురు చూశాయి కొంగలు. కాని మిత్రుడు రాలేదు. నేస్తానికేమయ్యిందోనన్న భయంతో ఉదయాన్నే వెతుక్కుంటూ బయలు దేరాయి. స్నేహితుడు ఎక్కడా కనిపించలేదు. ఎంతో పిలిచాయి. బదులు రాలేదు. కానీ దాని ఈకలు మాత్రం నిన్న సాయంత్రం మనిషి కూర్చున్న ప్రదేశంలో పడి వున్నాయి. ఎడమపక్కన మూరెడు పొడవున్న కర్రకు రక్తం అంటి వుంది. దాంతో వాటికి విషయం అర్థమైంది. మనిషి దాన్ని కాల్చుకుని తినేశాడని ఎంతగానో దుఃఖించాయి. మిత్రుణ్ణి తలచుకుని విలపించాయి. తమ మాట వినని మిత్రుడిని తలచుకుంటూ దిగులుగా ఆకాశంలోకి ఎగిరాయి.





# చిన్నారి చిత్రకారులు

**బి.గోపీనాథ్,** 10వ తరగతి, జడ్‌పిహెచ్‌స్కూల్, శావల్యాపురం, గుంటూరు.

**ఎ.సుకన్య, 9**వ తరగతి, ఎస్‌ఎంఆర్‌ఎం హైస్కూల్, నగరం.

**వై.అభిలాష్ యాదవ్,** 6వ తరగతి, పద్మశ్రీ పబ్లిక్ స్కూల్, జె.జి.నగర్, కర్నూల్.

# 10 ఎక్కాలొస్తే 20 వచ్చినట్టే!

చిన్నారులూ! ఏంటి అంత ఆశ్చర్యంగా చూస్తున్నారు? నిజం. 10 ఎక్కాలొస్తే 20 ఎక్కాలు వచ్చినట్టే. ఎలాగో తెలుసుకోవాలని తొందరగా వుందా! అయితే చెప్పాల్సిందేనంటారు. మరైతే కింద చూడండి.

| | |
|---|---|
| $2 \times \underline{1} = \underline{2}$ | $12 \times 1 = \underline{12}$ |
| $2 \times \underline{2} = \underline{4}$ | $12 \times 2 = \underline{24}$ |
| $2 \times \underline{3} = \underline{6}$ | $12 \times 3 = \underline{36}$ |
| $2 \times 4 = 8$ | $12 \times 4 = 48$ |
| $2 \times \underline{5} = \underline{1}0$ | $12 \times 5 = \underline{60}$ |
| $2 \times \underline{6} = \underline{1}2$ | $12 \times 6 = \underline{72}$ |
| $2 \times 7 = 14$ | $12 \times 7 = 84$ |
| $2 \times \underline{8} = \underline{1}6$ | $12 \times 8 = \underline{96}$ |
| $2 \times 9 = 18$ | $12 \times 9 = 108$ |
| $2 \times \underline{10} = \underline{2}0$ | $12 \times 10 = \underline{12}0$ |

2వ ఎక్కంలో కొన్ని అంకెల కింద గీత గీశాం కదా. ఉదాహరణకు $2\times\underline{1} = \underline{2}$. ఇందులో మీకు అనుమానమేం లేదుకదా. అలాగే $12\times1 = \underline{12}$. ఇందులోనూ మీకు అనుమానమేం లేదుకదా. ఇదే విషయం 2వ ఎక్కంలో వుంది. ఆశ్చర్యంగా వుందా. రెండు ఒకట్ల రెండులో అండర్‌లైన్ చేసిన అంకెలే. ఇలా పన్నెండు నాలుగుల వరకు రెండవ ఎక్కంలోంచే తెలుసుకోవచ్చు. ఇక పన్నెండు ఐదులకొచ్చేసరికి కొద్దిగా తేడా వుంది. అదేంటంటే... $2\times \underline{5} = \underline{1}0$ కదా. $5 + 1 = 6$. తర్వాత 10లోని సున్నాని 6 పక్కన వేసెయ్యాలి. అంటే 60 అవుతుంది. $12\times5= \underline{60}$ ఇలా పన్నెండు పదుల వరకు తెలుసుకోవచ్చు. ఇదే విధంగా మీరు 20 ఎక్కాల వరకు టకటకా చెప్పెయ్యొచ్చు. తమాషాగా వుందా! మరైతే ఒకసారి టెస్ట్ చేసి చూడండి.

❄

## వి'చిత్రం'

నేస్తాలూ... మీకోసం వచ్చిన విచిత్రం చూశారుగా. వాళ్లిద్దరూ భార్యాభర్తలు. వేసవి సెలవుల్లో మనవడిని తీసుకుని వినోదయాత్రకు వెళ్లారు. కానీ... పాపం పిల్లవాడు పొరపాటున తప్పిపోయాడు. ఇక తీవ్రంగా వెతకసాగారు. అసలు విషయం ఏంటంటే... వాళ్లు వెతుకుతున్న పిల్లవాడు ఈ బొమ్మలోనే వున్నాడు. ఎక్కడో కనిపెట్టండి చూద్దాం.

**జవాబు** ❄

ఏంటీ! తెలీలేదా? పోయినవారం మీకేం చెప్పాం. ఇలాంటివి ఏమైనా అడిగితే బొమ్మను నాలుగువైపులా తిప్పి చూడమన్నామా లేదా! ఇప్పుడు మీరు పుస్తకాన్ని తిరగతిప్పి చూడండి. ఆమె పెట్టుకున్న టోపీలో పిల్లవాడి తల కనిపించిందా! అదన్నమాట సంగతి.

## తేడాలు కనుక్కోండి



## క్యారెట్ కావాలంటే....



వీరి వీరి గుమ్మడిపండు...

## వీరి పేరేమి?

**హే**య్! ఈ వారం మీ ముందుకు వచ్చిన వారెవరో ఈపాటికి మీకు తెలిసే వుంటుంది. అయినా ఈయన తెలియని తెలుగు వాళ్లు వుంటారా చెప్పండి. ఈ మన్యం వీరుడి పేరేంటో కార్డుమీద రాసి మాకు పంపితే మీ పేరు, తరగతి, ఊరు ప్రచురిస్తాం. మా చిరునామా: **వీరివీరి గుమ్మడిపండు వీరిపేరేమి?** బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్టేట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

**17.4.05కు సరైన సమాధానాలు రాసినవారు**

కర్నె సురేందర్, బొమ్మెర, పాలకుర్తి, వరంగల్. పాతూరి భువనేశ్వరి, 2వతరగతి, కె.ఉన్నతి, 1వతరగతి, పణిదం. నెంబూరి రమేష్, 10వరతగతి, మార్చాల, మహబూబ్‌నగర్. ఎన్.సుజన్, 3వతరగతి, శ్రీవెంకటేశ్వరబాలకుటీర్, గుంటూరు. కాలువ శ్రీఅనూహ్య, 6వతరగతి, గుంటూరు. టి.శిరీషకుమారి, 3వతరగతి, కొత్తూరు, శ్రీకాకుళం. టి.ప్రదీప్‌కుమార్, 4వతరగతి, కొత్తూరు, శ్రీకాకుళం. ఎ.ఎస్.లోహిత, 3వతరగతి, ఎ.శరత్‌చంద్ర, 1వతరగతి, పాలకొల్లు. కిలారి అశోక్‌కుమార్, 10వతరగతి, మైనంపాడు, ప్రకాశం. కె.ప్రశాంత్, 5వతరగతి, నాదెండ్ల, గుంటూరు. ఎస్.కె.సల్మాసుల్తానా, 2వతరగతి, కందుకూరు. చిప్పాడ సాయిచక్రి, 4వతరగతి, కురుపాం, విజయనగరం. కె.అంజలీదేవి, 7వతరగతి, కె.కిరణ్‌కుమార్, 9వతరగతి, దిలీప్‌కుమార్ తాడేపల్లిగూడెం. ఎం.ఉషారాణి, 9వతరగతి, సెయింట్ జేవియర్స్ స్కూల్, ఒంగోలు. టి.పూర్ణచంద్రరావు, 9వతరగతి, కోటపాడు. ఎస్.కె.సబీహాసుల్తాన్, 6వతరగతి, కందుకూరు. డి.కళ్యాణి, 9వతరగతి, విశ్వనాథపురం, ప్రకాశం. యు.యు.బాబు నరేంద్రప్రసాద్, 7వతరగతి, డి.రిహానాభాను, 9వతరగతి, పి.విజయమాధవి, యు.భీమలింగ, ఎం.ప్రసాద్, యు.ఎం.అనిల్‌కుమార్, ఎం.షబ్బీర్‌హుస్సేన్, యు.ఈరన్న, ఆర్.రంజాన్, బి.రవితేజయాదవ్, కె.మజార్‌హుస్సేన్, బి.నరసింహులు, ఎం.బాలాజీ, యు.ఎస్.అనిల్, కె.విజయ్‌కుమార్, వి.మంజునాథ్, యు.రాజశేఖర్, ఎం.అమరేష్, ఎం.రమేష్, జి.సునందపవన్, ఎం.అనుదీప్, ఎం.తిమ్మప్ప, యు.ఎం.డి.నాసిర్, బి.శ్రీనివాసులు, 9వతరగతి, శ్రీవేణు విద్యాలయం, లక్ష్మీపేట, ఎమ్మిగనూరు. కె.జయమాధుర్, 4వతరగతి, తణుకు, పశ్చిమగోదావరి. కె.సి.గణేష్, యుకెజి, కానూరు, విజయవాడ. బి.ఆరీఫ్, 5వతరగతి, బండిమెట్ట, కర్నూలు. పి.జయశ్రీ, 7వతరగతి, చిలుకలూరిపేట, గుంటూరు. ఎం.అవినాష్, 7వతరగతి, ఎం.అభిషేక్, 3వతరగతి, కంచారం, శ్రీకాకుళం. పి.వానంతి, 8వతరగతి, అభ్యుదయనగర్, అద్దంకి, ప్రకాశం.

గతవారపు జవాబు
**కమల్‌హాసన్**

## లెక్కల ట్రిక్కులు మీకూ తెలుసా!

**హేయ్ నేస్తాలూ... పైన ఎక్కాల ట్రిక్కుల గురించి చెప్పుకున్నాంకదా. అలాంటివి మీకూ బోలెడన్ని తెలుసా? అయితే రాసి పంపారనుకోండి. బాల నేస్తాలులో ప్రచురిస్తాం. అప్పుడు మన మిత్రులంతా చదివి నేర్చేసుకుంటారు. అంతేకాదు మిమ్మల్ని ఎంతగానో మెచ్చుకుంటారుకూడా. మరి మా చిరునామా:** లెక్కల ట్రిక్కులు, **బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్టేట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్. మర్చిపోకుండా రాస్తారుగా.**



పొత్తూరి రాజేంద్రప్రసాద్‌వర్మ

# వెలుగు రేఖలు



చీకటి చిక్కబడుతోంది.

లోకమంతా ఆవరిస్తున్న చీకటి తన జీవితం చుట్టూ కమ్ముకుందని మంచికంటి లచ్చమ్మ మనసులో కుమిలి పోతోంది. దుఃఖం పొరలు పొరలుగా తన్నుకొని వస్తోంది. అయిదారు గంటలుగా ఏకదాటిన ఏడవడంవల్ల గొంతు పిడచకట్టుకుని పోయింది. ఆకలి, దాహం దహించి వేస్తున్నాయి. ఒకలాంటి నీరసం శరీరాన్ని చుట్టుముట్టింది.

చుట్టుపక్కల వారు బంధువులు ఊరడించారు.

"ఏం చేస్తాం... ఊరుకోమ్మా" అంటూ లచ్చమ్మను అనునయిస్తున్నారు. వారి మాటలు వింటుంటే ఆమెకు భవిష్యత్ అంతా గందరగోళంగా అనిపిస్తోంది.

ఏడు అడుగులు నడిచి జీవితాంతం తోడుంటాడని భావించిన వ్యక్తి అర్థాంతరంగా తనువు చాలిస్తే పరిస్థితి ఎంత దయనీయంగా ఉంటుందో పాతిక సంవత్సరాల లచ్చమ్మ మొదటిసారి గుర్తించింది. భర్తలేడు, మరి రాడు అనే భావన ఒక వక్క బాధపెడుతుంటే. ఇద్దరు పిల్లలతో సంసార నౌకను ఎలా నడిపించాలన్న బాధ ఎక్కువగా పీడిస్తోంది.

గుడిసె ముందు నులకమంచంపైన నీరసంగా పడుకుండిపోయింది. చుట్టుపక్కల ఆడవాళ్లు ఆమె చుట్టూ కూర్చున్నారు. ఇద్దరు కూతుళ్లు తల్లిని కరుచుకుని బిక్కుబిక్కుమని చూస్తున్నారు.

దూరంగా పోలయ్య శవం.

జరగవలసిన ఖర్మకాండను బంధువులంతా దగ్గరుండి జరిపిస్తున్నారు. చిరుచీకటి మొదలు కాకముందే శవయాత్ర ప్రారంభం అయిపోయింది.

ఒకొక్కరు వెళిపోతున్నారు.

చీకటి పడుతోంది. అయినా లచ్చమ్మకు అక్కడి నుంచి లేవాలని అనిపించడం లేదు. ఇద్దరు కూతుళ్లను దగ్గరికి తీసుకుంది. అమ్మ ఎందుకు ఏడుస్తుందో.... నాన్న ఏమైపోయాడో ఆ రెండు చిన్న మనసులకు అర్థం కావడం లేదు. ఏదో జరిగిందని మాత్రం తెలుసు. అమ్మ ఏడుస్తుంటే వారికి కూడా ఏడుపు తన్నుకు వస్తోంది.

"అమ్మా! నాన్నను ఎక్కడికి తీసుకుపోతున్నారు?" పెద్ద కూతురు వెంకటమ్మ అడిగింది. నాలుగేళ్ల వయసు కూడా లేని ఆమె మాటలను చిన్న కూతురు ఊర్మిళ ఆసక్తిగా వింటూ తల్లి ఏం సమాధానం చెబుతుందా అని చూస్తోంది.

లచ్చమ్మ కూతురు ప్రశ్నకు జవాబు చెప్పలేదు.

కన్నీళ్లు బొటబొటా కార్చింది. తర్వాత గొంతు కూడదీసుకుని "మరి నాన్న ఇకరాడమ్మా! మనకి దూరంగా వెళిపోయాడు" అని మాత్రం అంది. అలా అంటూ ఇద్దరు కూతుళ్లను దగ్గరకు తీసుకుని గుండెలకు హత్తుకుంది.

తల్లి గుండెల్లో గువ్వల్లా ఒదిగిపోయారు.

ఆ పల్లెలో గుడ్డిదీపాలు వెలిగాయి.

* * *

వరంగల్ జిల్లా కురవి మండలం కందికొండ గ్రామానికి చెందిన మంచికంటి లచ్చమ్మ పేదరికంలో పుట్టి, పెరిగింది. పేదరికాన్నే పెళ్లాడింది.

నాయీబ్రాహ్మణ కుటుంబానికి చెందిన ఆమె కుటుంబంలో ఒకతే సంతానం. కూలినాలి చేసుకుని బతికే కుటుంబం... కులవృత్తినే జీవనాధారం చేసుకుని జీవిస్తున్నారు. ఎదిగిన లచ్చమ్మను ఒక అయ్య చేతిలో పెట్టాలని ప్రయత్నించారు. కట్న కానుకలు పెద్దగా ఇవ్వలేని పరిస్థితి. అయినప్పటికీ ఉన్నంతలో అప్పుచేసి మరీ వివాహం చేశారు.

పక్క గ్రామంలో ఉన్న పోలయ్య అనే యువకుడు వారి దృష్టిలో పడ్డాడు. తల్లీదండ్రీలేని ఒంటరి యువకుడు. మేనమామ వద్ద పెరిగాడు. గ్రామంలో ఇంటింటికి తిరిగి క్షురకవృత్తి చేసి అంతో ఇంతో సంపాదిస్తున్నాడు. అతనితో లచ్చమ్మ పెళ్లి చేస్తే సుఖపడుతుందని తలంచారు. అందుకు తగిన ప్రయత్నాలు చేశారు.

ఎవరూలేని తన ఒంటరి జీవితానికి ఆలంబన దొరుకుతుందని పోలయ్య కూడా ఎంతో సంతోషించాడు. లచ్చమ్మతో వివాహానికి అంగీక రించాడు. సాంప్రదాయ పద్ధతిలో కంది కొండలో వారి వివాహం జరిగిపోయింది.

లచ్చమ్మ నివాసం శాశ్వతంగా కంది కొండకు మారిపోయింది. భర్తకు అనుగుణంగా ఆమె జీవితాన్ని మార్చుకుంది. రోజూ ఉదయాన్నే గంజి అన్నం తిని ఊరిలోకి బయలుదేరేవాడు. అంతకుముందు కత్తెరలకు సానపట్టడం, గెడ్డం చేయడానికి ఏర్పాట్లు చేసుకోవడం చేసేవాడు. క్షురకవృత్తికి సంబంధించిన పరికరాలన్నీ చిన్న కర్రపెట్టెలో సర్దుకుని బయలుదేరేవాడు.

రోజువారి ఖాతాల ప్రకారం ఇంటింటికి వెళ్లి గెడ్డాలు గీయడం క్షవరం చేయడం చేసేవాడు. వారు ఇచ్చిన పదో పరకో జేబులో వేసుకునేవాడు. కొంతమంది గ్రామపెద్దలు మాత్రం ఏడాదికి ఒకసారి ధాన్యం, ఉప్పులు, పప్పులు, వేరుశెనగ, పెసలు, చోళ్ల వంటి తిండిగింజలను ఇచ్చేవారు.

మధ్యాహ్నం ఆకలి వేసేంతవరకూ పనిచేసి పోలయ్య ఇంటికి తిరిగి వచ్చేవాడు.

మధ్యాహ్నం గంటా రెండుగంటలు గుడిసె దగ్గరి వేపచెట్టు కింద పడుకోవడం లేచిన తర్వాత పనిలోకి పోవడం నిత్యకృత్యం అయిపోయింది.

జీవితం గొప్పగా లేకపోయినా సాఫీగా సాగిపోయే స్థితిలోకి వచ్చింది. వెంకటమ్మ, ఊర్మిళ అనే ఇద్దరాడ పిల్లలకు తండ్రి అయ్యాడు. వారు పాఠశాలలో చేరే వయసుకు రాకముందే పోలయ్య వీరికి దూరమయ్యాడు. ఒకరోజు రాత్రి పొలం గట్టు వెంబడి వస్తుంటే నాగుపాము కాటు వేసింది. సకాలంలో వైద్యసాయం అందలేదు. నురగలు కక్కుకున్న పోలయ్య లోకం నుంచే సెలవు తీసుకున్నాడు.

భర్త పోలయ్యలేని లోటు లచ్చమ్మకు తర్వాత స్పష్టంగా తెల్సింది. ఇద్దరు కూతుళ్లను పెంచి పోషించవలసిన బాధ్యత ఆమెపైన పడింది. పుట్టింటివారు తనను ఆదరించే స్థితిలో లేరు. అత్తింటిలో భర్తతప్ప అతని తరపువారు ఎవరూలేరు. ఈ పరిస్థితిలో ఎక్కడికి వెళ్లాలో ఆమెకు తోచలేదు.

భర్త చనిపోయిన వారం పదిరోజుల వరకూ ఇరుగు పొరుగువారు ఇచ్చిన బియ్యం, కూరలతో రోజులు గడిపింది. ఆ తర్వాత చుట్టుపక్కల ఇళ్లల్లో పాచిపనికి కుదిరింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ అన్ని పనులు వదులుకుని పనిచేస్తే వచ్చే జీతం అంతంత మాత్రంగానే ఉండటంతో ఆ పనులపైన కూడా లచ్చమ్మకు విరక్తి కలిగింది.

ఎదుగుతున్న ఇద్దరు ఆడపిల్లలను పోషించాలంటే ఏదో చేయాలి అని అనుకుంది. ఎంత ఆలోచించినా ఏమి చేయాలో తెలియలేదు. డబ్బులు సంపాదించాలంటే డబ్బులు కావాలన్న వాస్తవం క్రమంగా ఆమెకు అనుభవంలోకి వచ్చింది. కూలిపని, క్వారీపని, పాచిపని ఇలా ఒకొక్కపనిని బేరీజు వేసుకుని తను చేయగలనా అని విశ్లేషించుకుంది. ప్రతి పని చేయడం వెనుకా ఏదో కష్టం ఉందన్న విషయం లచ్చమ్మ గుర్తించింది.

ఆ రోజు ఇంటిలో నులకమంచంపై పడుకుని పూరిపాక చూరువైపు చూస్తూ ఉండిపోయింది. జీవితాన్ని ఎలా ఈదాలి, సంసారాన్ని ఎలా ముందుకు తీసుకువెళ్లాలని ఆమె ఆలోచనలు పరివరి విధాలుగాపోయాయి.

ఆ సమయంలో వేలాడుతున్న కర్రపెట్టె కన్పించింది.

అది పోలయ్య క్షురకర్మకు ఉపయోగించే సామాన్లతో కూడిన కర్రపెట్టె. గబగబా స్టూలువేసుకుని దానిని కిందకు దింపి తెరిచింది. అద్దం, దువ్వెన కత్తెరలు వంటి సామాగ్రి ఉంది.

వాటిని చూడగానే లచ్చమ్మలో కొత్త ఆలోచనలు మదిలో మెదిలాయి. 'భర్త వదిలిపెట్టిన వృత్తిని తను ఎందుకు కొనసాగించకూడదు' అనుకుంది. అనుకున్నదే తడువుగా దృఢ నిర్ణయానికి వచ్చింది. అందుకు తగిన ప్రయత్నాలు మొదలుపెట్టింది.

చిన్నతనంలో తండ్రిచేసిన పనిని, తర్వాత భర్త చేసిన క్షురకవృత్తిని గుర్తుకు తెచ్చుకుంది. అదేమీ కష్టమైన పనికాదని ఆమెకు అనిపించింది. కత్తెరలకు పదునుపెట్టి ఓ రోజు పనిని మొదలుపెట్టింది.

మొదట ఆమె ఆ పని చేయడాన్ని ఎవరూ సమర్థించలేదు. కానీ పాపం కష్టపడటానికి సిద్ధపడింది. కులవృత్తే కదా చేస్తోంది. ఆడవాళ్లు ఎవరూ ధైర్యం చేయని పనిని ఈమె చేస్తుందిలే... అంటూ రకరకాల వినిపించాయి. పల్లెటూరు కావడంవల్ల వ్యాఖ్యానాలు సెలూన్లు వంటివి లేనందువల్ల, లచ్చమ్మను ఆదుకోవాలన్న తపనవల్ల కొంతమంది ఆమెను ప్రోత్సహించాలని ముందుకువచ్చారు.

లచ్చమ్మ పరిస్థితి దీంతో సులభమయ్యింది. జుత్తు పెరిగినవారు, గడ్డం మాసినవారు ఆమె ఇంటిముందుకు వచ్చేవారు. గుడిసె ముందు పెద్ద బండరాయిమీద కూర్చోబెట్టి క్షవరం చేసేది. మొదట్లో సరిగా కుదిరేది కాదు. ఒక వ్యక్తికి క్షవరం చేయాలంటే గంట సమయం తీసుకునేది. క్రమంగా ఆమెలో నైపుణ్యం పెరిగింది. ఎంత తలమాసిన వ్యక్తి వచ్చినప్పటికీ చకచకా పని చేసేది.

ఈ పని చేసేటప్పుడు ఆ వచ్చినది పురుషుడనీ, తాను స్త్రీనని ఆమె గమనించేది కాదు. తాను అనుకున్నది ఎలాగైనా సాధించాలి. వృత్తిపనిలో నైపుణ్యాన్ని సంపాదించాలి అన్న తపన ఆమెను ముందుకు నడిపించేది. అందుకు అనుగుణంగానే క్షురకవృత్తిని అభివృద్ధి చేసుకుంది.

చేయాలన్న తపన, సాధించాలన్న పట్టుదల ఉంటే ఏదైనా పొందవచ్చునన్నదానికి లచ్చమ్మ ఉదాహరణగా నిలిచింది. పోలయ్యకన్నా అందంగా చాకచక్యంగా క్షవరం చేయగలదని లచ్చమ్మ పేరు సంపాదించుకుంది. కందికొండ గ్రామంలో అత్యధికులు ఆమె వద్దకు వచ్చి క్షురకర్మ చేయించుకుంటున్నారు. తృణమో ఫణమో చెల్లించుకుంటున్నారు.

"కులవృత్తికి సాటిరాదు గువ్వలచెన్నా" అన్న విధానంలో లచ్చమ్మ కృషి ఫలించింది. స్త్రీలు ఏ రంగంలో అయినా విజయం సాధించగలరని నిరూపించింది. కుటుంబానికి ఆర్థికపరమైన వెసులుబాటు రావడంతో ఆమె కొంత సంతృప్తి చెందింది. ఇద్దరు పిల్లల్ని చదివించింది. వారికి పెళ్లిళ్లు చేయడానికి సిద్ధపడింది. ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా వృత్తిని కొనసాగిస్తోంది.

* * *

కందికొండ గ్రామం.

మధ్యాహ్నం మూడుగంటలు అయింది.

బి.సి. కార్పొరేషన్ అధికారుల బృందం జీపులో ఆ గ్రామానికి వచ్చారు. గ్రామ కార్యదర్శి తయారు చేసిన జాబితాల ప్రకారం రుణసదుపాయం కల్పించడానికి పరిశీలన ప్రారంభించారు.

సెలూన్ పరికరాలకై లచ్చమ్మ దరఖాస్తు అధికారి ప్రసాదరావును విపరీతంగా ఆకర్షించింది.

"క్షురకవృత్తి చేస్తున్నది స్త్రీనా? ఆశ్చర్యంగా ఉందే? ఈమె పేరుతో బినామీగా రుణానికి ఎవరైనా దరఖాస్తు చేశారా? లేదా ఈమె వేరే పనిచేస్తూ తన కులం ఆధారంగా ఈ రుణం పొందడానికి ప్రయత్నాలు చేస్తోందా?" ఆయన ప్రశ్నల వర్షం కురిపించాడు.

కార్యదర్శి చెప్పిన వివరాల ప్రకారం లచ్చమ్మ ఇంటికి బయలుదేరాడు. ఇంటి ముందు జీపు ఆగడంతో లచ్చమ్మ గ్రామస్తులకి చేస్తున్న క్షవరాన్ని నిలుపుచేసి దండం పెడుతూ దగ్గరికి వచ్చింది. "బి.సి. కార్పొరేషన్ అధికారిని రుణ దరఖాస్తును పరిశీలించడానికి వచ్చారు!" అని కార్యదర్శి వివరించాడు.

నులకమంచం వాల్చి కూర్చోబెట్టింది.

ప్రసాదరావు చుట్టుపక్కల పరిశీలనగా చూసాడు. చిన్న పూరి గుడిసె... చుట్టూ అపరిశుభ్ర వాతావరణం... వేపచెట్టు... దానికింద పెద్ద రాతిబండ... ఆ బండ చుట్టూ తలవెంట్రుకలు... "ఎన్నాళ్ల నుంచి చేస్తున్నావమ్మా! నీకు ఏం కావాలి?" అడిగాడు.

ప్రసాదరావు ప్రశ్నకు లచ్చమ్మ తబ్బిబ్బయింది.

"బాబూ! కష్టాలతో నా జీవితం మొదలైంది. పిల్లలకు ఊహ తెలియని వయసులో నా భర్త చనిపోయాడు. ఏ పనీ చేయలేక ఈ పని నేర్చుకున్నాను. కులవృత్తి చేస్తున్నానన్న సంతృప్తి తప్ప జీవితంలో ఆర్థిక పరమైన వెసులుబాటు కలగలేదు. ఈ బండరాయిమీదే నా పని అంతా... కొత్త కత్తెర్లు, పరికరాలు కొనుక్కోవడానికి కూడా డబ్బులు లేవు. ఏ రోజు వచ్చిన సొమ్ము ఆరోజు తినడానికే సరిపోతోంది."

ఆమె మాటలు కదిలించాయి. ప్రసాదరావు విచలితుడయ్యాడు. ఎంతోమందికి రుణ సదుపాయం కల్పించిన ఆయనకు లచ్చమ్మ ఉదంతం గొప్ప కదలిక తీసుకువచ్చింది.

"అమ్మా! ఎంతోమంది ఆడవాళ్లకు భిన్నంగా నువ్వు చేస్తున్న పని అభినందనీయం. నీ కృషిని ఎవరైనా మెచ్చుకుని తీరాలి. నీలాంటి వారిని ప్రోత్సహిస్తే మరింతమంది తమ కాళ్ళమీద తాము నిలబడటానికి ముందుకు వస్తారు. నీకు తప్పకుండా సబ్సిడీ రుణాన్ని మంజూరు చేస్తాను" అని ప్రకటించారు.

ఆయన మాటలు లచ్చమ్మ కళ్ళల్లో వెలుగులు చిమ్మించాయి. నమస్కారం చేస్తూ "మీ మేలు మరిచిపోలేనయ్యా!" అంది వినయంగా

ప్రసాదరావు లేచి నిలుచుని జీపు ఎక్కి కూర్చున్నాడు. రోడ్డు మలుపు తిరిగేంతవరకూ లచ్చమ్మ జీపును చూస్తూనే ఉండిపోయింది.

సూర్యుడు అస్తమిస్తున్నాడు.

వెలుగురేఖలు విచ్చుకుంటాయి. ★

# బడాయిపై లడాయి

**రుక్మిణి**

ఓ మొగుడు గారూ... కాస్తంత గెడ్డం గీస్కుంటనే నే జెప్పే మాటలిను...

మా అత్త...అదే మీ అమ్మగారు మన పెండ్లయిన కొత్తలో ఏమన్నది? జర సొంచాయించి యాదికి తెచ్చుకోండి! మీరు మరిచిపోయినా నాకు జరజర కాదు... పూరాగా గ్నాపకముంది.

గప్పటి దినాల్లో మన పక్కింటి పెంకుటిల్లు రాజవ్వది. మనింటెనకాతల పెరట్లో చేదబాయి దగ్గర, నీళ్ళ గాబు పక్కన చప్టా మీద కూకుని అన్నది. అన్నట్టు గా రాజవ్వకు నుట్ట అలవాటుండేది. పాపం... మనింటెన కాతలకొచ్చి, గబగబ తాగి, నోరుకడుక్కుని పొయ్యేది. ఆమె పెనిమిటి కూడా శానమంచోడేమో... దాని నోరు జరవాసనొచ్చినా పట్టిచ్చుకునేటోడు కాదు.

ఏందయ్యా... జెప్పేది తిన్నగా సెప్పకుండా ఫ్లాష్‌బ్యాక్కులాగా ఎక్కడికో ఎల్లిపోయానని అట్లా నోరు తెరిచావేమయ్యా...రేజరు నీ గెడ్డాన్ని తెంపేత్తది...జర జాగ్రత్త. సుట్టరాజవ్వ సంగతి అసుంటపెడతాలే.

మా అత్త అనగా మీ అమ్మ ఏమందంటే...రాజవ్వా...! నా కోడలొచ్చినవేళ నా కొడుకు వుద్యోగం పరమనెంటయ్యిందంట. ఇంగ గవర్మెంటు ఊడబీకుద్దన్న భయం అస్సలు లేదట...అంది.

నేను మొండిగోడ వెనకాతల గోనెపట్టమీద కూలబడి పూలు ముందేసుకుని పూలచెండు కట్టుకుంట ఇంటున్న.

"గంతేనమ్మా... కోడలు పిల్ల పాదంపెట్టిన వేళాయె"... (గుసగుసన సుట్టపీకినట్లుంది)

సరే... మన కాపరం మూడుపూలు ఆరుకాయలుగ వెలిగిపోతంది గద.

మీకో శుభవార్త చెప్పాలె... అని మీ చెవుల గుసగుస చెప్పిన.

నేను చెప్పిన 'శుభవార్త' విని మీరు మంచం మీదనే మబ్బులు కట్టుకుని పొంగిపోయింద్రు గద.

తర్వాతేమయింది...

తెల్లారి మీరు నన్ను ఆసుపత్రికి తీస్కుపోయింద్రు. అక్కడ స్కానింగు చేయించింద్రు. నా కడుపుల వున్నది 'మాలచ్మీ' అని తెలిసి నేను కొండంత సంబరపడితే... మీరేమో ఎందుకో మొఖం మాడ్చుకున్నరు.

నా కర్థం కాలేదు.

గపుడు నేనంటిని... "సూసింద్రా... నా కడుపున 'మాలచ్మీ'పడ్డది మీకు పెద్ద ప్రమోషను వచ్చింది గద" అని.

మీరు రుసరుస సూసింద్రు. నాకస్సలర్థం కాలేదు. ఇంటికి వచ్చినంక "వెంటనే అబార్షను చేయించుకుందాం... మొదటిబిడ్డ కచ్చితంగా మగ మారాజు కావాలె... నాకిష్టం" అని మీరన్నరు.

నాకస్సలర్థం కాలేదు.

మరి మీ అదృష్టాలకూ... మీకు అనుకోకుండా దొరికే వుద్యోగాలకూ... కలిసొచ్చే సంపదలకు... వళ్ళో వచ్చిపడే ప్రమోషన్లకూ ఆడకూతురు ఆగమనం వల్లనే కలిసొచ్చిందని బడాయిలు పోతరు. మీ సెంటిమెంటు బడాయిలవరకేనా?! బడాయిలు పూరికెనే పోతారో...నమ్ముతారో నాకనవసరం.

మరి గట్లాంటి మాలచ్మిని భూమ్మీదకు రాకుండా చంపాల్నని ఎందుకనుకుంటాన్నరు. ఇదో రకమైన బడాయి సెంటిమెంటు?!

మరి రెండునెల్ల కిందట జరిగిన సంగతేంది? దానికి మీరు, నేను సంబరపడాలా... తలబాదుకోవాల్నా...?

ఆ రాత్రి...

మీరు మహ సంబరంగా మల్లెపూలపొట్లం పట్టుకుని వచ్చింద్రు... నేను మేలుకునేవున్నా.

"భామా... నీకో శుభవార్త... అర్జంటుగ చెప్పాలె... ముందు ఈ పూలుపెట్టుకో" అని నాకు చక్కిలిగింతలు కూడా పెట్టింద్రు... ఎట్ల మర్చిపోగలను.

నేను బిత్తరపోతిని తెల్లమొఖంపెట్టి 'అర్ధరాత్రి శుభవార్తలేంది' అని వెర్రిమొఖం ఏసుకుని అడిగినగద!

"నాకు పెద్ద ప్రమోషనొచ్చింది. భామా..." సూపర్నెంటో... ఇంజనీరో అన్నంతగా మీరు సంబరంగ చెప్పారు. గెజిటెడని కూడా అన్నరు.

నాకు చాలా సంబరమయింది. మరప్పుడే...మరి నేను కూడా



మీ బడాయిపై లడాయి జేత్తేగానీ మీకు తెలిసిరాదు.

అలాగనగానే ఆయన ఎప్పుడూ లేందివ్వాళేంది ఇలా అనుకున్నారు. అనుకోడమే కాదు ఆశ్చర్యంతో నోరు తెరిచేశారు.

మరిందాక నేను జెప్పినా...నోరు తెరవమాకండి బాబో అని. ఆడది చెప్పితే ఎందుకు ఇనాలా అనుకున్నారో ఏమోగానీ...నోరు తెరిచారా...రేజర్లున్న బ్లేడు కసిక్కున తెగ్గోసింది.

మరి ఆయన నాకు మొగుడుగానీ...బ్లేడుక్కాదుగా...!

# 'మత మంటేందనుకున్నరు...?'

కాలువ మల్లయ్య

"మతం మనిషికి అవసరమా...? అది లేకుంటేమైతదట... అరెబై గీ మతం మనకేమిచ్చింది...? మనిషి తెలివిమీరుతున్నకొద్ది మతమని, కులమని ఇంకింత కుంచించుక పోవట్టె... ఇరుకున పడవట్టె... మన చిన్నప్పుడు ఊల్లల్ల గిప్పుడున్న మత భేదాలుండెనా...? ఏదో అట్ల ఎవ్వలకు తోసినట్టు వాళ్ళు పూజ చేసుకుందురు... ఒక్క పొద్దుందురు. ఏదో మొక్కుకుందురు. కని దేవునిపేరు మీద గిన్ని విషపాతుకాలుండెనా...? గింత కొట్టుక సచ్చుడుండెనా...? అరె బై గా గుజరాత్ లేమైంది...? ఒరిస్సాల బిషప్పు సంగతేమైంది...? ఇంకెన్ని తీర్ల నాశినగాలాలయినయో మనకెరికే గద...! గిట్లుంటదా మరి మతమంటె... గా మతం పేరుమీద కొట్టుక సచ్చుడేంది బై... నరుక్కునుడేంది బై... ఇంతకూ మతమంటేంది...?"

అన్నడు నర్సింహారెడ్డి ఎవ్వెవ్వో యాదికచ్చి బాధపడుకుంట...

"మతమంటె మత్తుమందని కారల్‌మార్క్స్! ఎప్పుడో చెప్పిండు... గది తలకెక్కిందంతే మరి... మన దేశంల ఇంకా రాజకీయాల నుంచి మొదలుకొని అన్నీ మతం, కులాల సుట్టే తిరుగుతున్నయి. గందుకే గిట్లయితంది... గీ మత్తులల్ల దేశం జోగుతుంటే అభివృద్దెట్లయితది...?"

"ఇంతకు మత మంటేంది...?"

"మతమంటె ఇష్టమని అర్థం... నీ ఇష్టమున్న జీవన విధానాన్ని ఎన్నుకునుడు... గాయింత మాత్రానికి గీ కొట్టుక సచ్చుల్లెందుకు...? ఎవ్వల దేవత మైతే మాత్రం పోయేదేముంది...? వచ్చేదేముంది.

గదాన్నే ఘనీభవించుక పోయేటట్టు జేసింద్రు...

మతమంటె ఉన్నది కండ్లకు కనిపించేదాన్ని లేదంటది... లేనిదాన్ని ఉన్నదంటది. హేతువుకు నిలవని వాటినే సత్యమంటది...

అయ్యోమరి...! గీ మతమే కద హేతుబద్ధంగ ఆలోచించాలన్నందుకు చార్వాకులను చంపేసింది.

ప్రశ్నించడం నేర్పినందుకు సోక్రటీస్‌కు విషమిచ్చింది. అందరు కలిసి మతాలకతీతంగ బతుకాలన్నందుకు మహాత్మాగాంధీని హత్య చేసింది... గిట్ల మతం పేరు మీద ఎన్ని కల్లోలాలని...? ఎన్ని లొల్లులని...? ఎన్ని ఉద్రిక్తతలని... మతాలకోసం యుద్ధాలయినయి... రక్తపాతమయింది...! మన దేశంల ఇతర మతాలు లేనప్పుడు శైవులు, వైష్ణవులు తన్నుకున్నరు. అటెనుక ఇతర మతస్థులతోని తన్నుకున్నరు. మతాలు గిట్ల కొట్టుకొమ్మని సెప్పలేదు. కావచ్చుగాని గివ్వీటితోని షాన నష్టాలే అయినయి. ఎవ్వలకు సుఖమిచ్చినయని గివ్వి..."

"ఏంది...? వూనుకమచ్చినట్టు ఒగలెనుకొగలు మతాలను తిడుతంద్రు... సెక్యులరిజమంటె మతాలను తిట్టుడుగాదు... అన్ని మతాలను సమానంగ గౌరవించుడు..."

"నీకు మతమంటె మాదండి పేమని ఎరుకేకని లక్ష్మణ్‌రావ్... మనదేశంల మతాలు, దేవుల్లు బాగెక్కువ గద...! అయినాగని సమస్యలు, పేదరికం ఎక్వ ఎందుకుంది... అవేవి సమస్యల నుంచి కాపాడుతలెవ్వేంది?"

రమేష్ మాటలకు మొకం మాడ్సిండు లక్ష్మణ్‌రావ్...

"భౌతికవాద పునాదులున్న కాడ మనుషుల గురించెక్కువ పట్టించుకుంటరు... గసోంటి దేశాల అభివృద్ధి వేగంగ జరుగుతది. మతవాద పునాదులుంటె మనిషి బతుకున్నప్పటి జీవితం కంటె మరణానంతర



జీవితం ఎక్వ అని భ్రమలల్ల పెడ్తరు... అందుకే దేశమంటె మట్టికాదు దేశమంటె మనుషులన్నడు గురజాడ... దేశాన్ని ప్రేమించుడంటె మనిషిని ప్రేమించుడు గావాలె... మతవాదులు మట్టికి, రాయిరప్పల కిచ్చిన విలువ మనిషికియ్యరు...

గురజాడ ఇంకో మాట గూడన్నదెరికెనా...? భారతదేశం నుంచి బౌద్ధం మాయమైపోయినప్పుడే దేశం మత విషయకంగ ఆత్మహత్య చేసుకున్నదన్నడు... బౌద్ధం ఘనీభవించిన మతంకాదు... భారతదేశంల పుట్టిన గొప్ప తాత్విక చింతన... అది కులాలు, వర్గాలకతీతంగ అందర్ని తనలో కలుపుకుంది. బౌద్ధంల భౌతికవాద పునాదులున్నయి. మనిషి మనుగడ గురించిన ఆలోచనుంది... మనిషి దుఃఖానికి కారణలేంటో చెప్తండు బుద్ధుడు... అష్టాంగమార్గాలను అవలింబించమన్నడు. చాలా మతాలు స్త్రీలకు విలువివ్వలేదు. బుద్ధుడు వాళ్ళను చేర్చుకున్నడు. బౌద్ధం కొంతవరకు మనిషిని గురించి పట్టించుకున్నది..."

"అవుమరి... గామాట నిజమే... ఏముందిలే రాజమల్లన్న..."

"నేనేమంట మరి... ఉన్నదాన్ని కాదంటనా...? గవ్వన్ని నిజాలేనని మనందరికెరికే... అయితె గీ మతాల గురించి జరుగుతున్న సంగతులు జూత్తుంటె నాకయితె మా చిరాకనిపిత్తంది..."

"గట్లంటవేందే రాజమల్లన్న..."

"మన చిన్నతనంల ఊల్లల్ల మతాలున్నా తెలిసేదా...? వెవ్వలదే మతమన్న దాన్ని పట్టించుకుందురా...? శ్రామిక కులాలోల్లు పోచమ్మకో మైసమ్మకో మొక్కుకుందురు... గీ మతాల ప్రభావం ఎవ్వలమీద గూడ ఏమంత ఉండకపొయ్యేది... అన్ని మతాలోల్లు ఒకరి పండుగలల్ల ఒకరు పాలుపంచుకునేటోల్లు... ఒకరు పెట్టిన ప్రసాదం ఒకరు తినెటోల్లు... పీరల పండుగప్పుడందరు పీరల కుటుకలేసిటోల్లు... తల్లి పీరికింది కెళ్ళి ఈగిటోల్లు... దసుర, సంక్రాంతి పండుగలప్పుడు అన్ని మతాలోల్లు సంబురంగ పాలుపంచుకునెటోల్లు... ప్రసాదం తినెటోల్లు... ఏ మతపోల్లయిన ఖుషీగ పాల్గొనెటోల్లు... మతమంటెవ్వలు పెద్దగ లెక్కబెట్టెటోల్లుగాదు... భేదాలుండకపోవు...

మరి అటెనుకేమైంది? సదువులు పెరిగినంక, సానమంది తెలివికచ్చినంక ఏమన్న భేదాలుంటె పోవన్నా...? బాగపెరిగినయి... సదువులతోని, రాజకీయాలతోని ఊళ్ళళ్ళకు మత భేదాలను తీనుకచ్చింద్రు... మతాలను రాజకీయం జేసింద్రు... దేవుళ్ళను రాజకీయం జేసింద్రు... ఇంకేందిగ లొల్లులు మొదలైనయి... అరే గా మతాల పేరు మీద మానవత్వం మరిచిరి. బేధాలు పెంచుకున్రి... ఒగల పూజామందిరాలనొగలు కూలగొట్టుకున్రి... గవ్వీట్ని ఓట్లుగ గూడ మలుచుకున్రి... ఆఖరుకు బుద్ధున్ని గూడ ఇడ్సిపెట్టకపెయిరి... ఎవ్వలయితేంది... ఎక్కడయితేంది...? మతాలేమన్న తక్వ విధ్వంసం సృష్టించినయా...?

ఆసోంటి గీ మతాలు లేకుంటేందట...! మతాలు లేకముందు మనిషెంత ప్రశాంతంగ బతికిండో...! మతం లేకుంటె మనిషి బతుకడా...! బంగారమోలె బతుకుతడు... మతమద్దు... మనిషితనముండాలె..." అన్నడు రాజమల్లు...

అవునన్నట్టు తలూపింద్రు సానమంది...

అందరూ గామాటల్లోని నువ్వద్ది గురించాలోసిత్తంద్రు. ★

# స్కిజోఫ్రెనియా - జన్యు చికిత్స



**ప్రపంచ వ్యాప్తంగా వున్న మానసిక వ్యాధులతో అత్యంత సమస్యాత్మకమైన మానసిక వ్యాధి స్కిజోఫ్రెనియా. సాధారణంగా అత్యంత తెలివి తేటలు కలిగిన వారిని, మేధావుల భవిష్యత్తును కాటేస్తున్న ఈ మానసిక వ్యాధి ముఖ్యంగా 20-30 సంవత్సరాల మధ్య వయస్కులలో కనిపిస్తోంది.**

వంశపారంపర్యంగా కూడా ఈ వ్యాధి వచ్చే అవకాశం వుంది. వ్యాధిని పూర్తిగా అదుపులో పెట్టే మందులు లభ్యమవు తున్నా... ఎక్కువ కాలం వాడాల్సి రావడం, అసలే మానసిక వ్యాధి అయినందున... బాధితులు మందులు మింగేందుకు ముందుకు రాకపోవడం వంటి సమస్యల వల్ల వ్యాధి ఆయా వ్యక్తులలో కుటుంబపరంగాను, సమాజంలోనూ అనేకానేక సమస్యలు సృష్టిస్తూనే వుంది. వ్యాధిగ్రస్తులు తాము మానసిక వ్యాధిగ్రస్తులమన్న భావన నుంచి బయట పడలేకపోతున్నారు. సమాజం, చుట్టుప్రక్కల వారు అదే భావనలో వుంటున్నారు. ఫలితంగా సమస్య జటిలమవుతుంటుంది.

ప్రపంచ వ్యాప్తంగా ప్రతి వందమందిలో ఒకరు స్కిజోఫ్రెనియాకు గురవుతున్నట్టు గణాంక వివరాలు తెలుపుతున్నాయి. వ్యాధిని నివారించేందుకు అనేక దేశాలలో పరిశోధనలు జరుగుతున్నాయి. వ్యాధి స్థాయిని బట్టి అనేక రకాల మందులు, ఎలక్ట్రో కన్వర్షన్ థెరపి (ఇ.సి.టి.) వంటి చికిత్సా విధానాలు ఎంతో కాలంగా అందుబాటులోకి వచ్చాయి. స్కిజోఫ్రెనియా వ్యాధిపై విస్తృత పరిశోధనలు నిర్వహిస్తున్న సంస్థలలో ఒకటైన అమెరికాలోని వాషింగ్టన్ లో గల నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ (ఎన్.ఐ.హెచ్) జీన్ థెరపీపై ప్రయోగాలు నిర్వహిస్తోంది. మానవ దేహంలో 17 ప్రధాన అవయవాలకు సంక్రమించే వ్యాధులపై ఈ సంస్థ పరిశోధనలు నిర్వహిస్తోంది. అందులో మెదడు కూడా ఒకటి. మెదడుకు సోకే మానసిక వ్యాధులలో స్కిజోఫ్రెనియా ప్రధానమైనది. అన్ని దేశాల వారికి, జాతుల వారికి ఈ వ్యాధి ఒకేలా వస్తోంది. ప్రపంచానికే నేడు ఈ వ్యాధి ఒక సవాలుగా పరిణమించిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చును. అందుకే ఎన్.ఐ.హెచ్. సంస్థ ఈ వ్యాధి నివారణకు కంకణం కట్టుకుంది. స్కిజోఫ్రెనియాకు కారణమవుతున్న జన్యువు (జీన్)లను గుర్తించి వీటిని నివారించేందుకు పరిశోధనలు నిర్వహిస్తోంది. ఏ జీన్స్ ఈ వ్యాధి సంక్రమించడానికి కారణమవుతున్నాయి? ఆ జీన్స్‌లో ఎలాంటి మార్పులు సంభవించడం వల్ల ఈ వ్యాధి వస్తోంది? మొదలయిన అంశాలపై సంస్థ లోతుగా పరిశోధిస్తోంది.





ఇప్పటికే స్కిజోఫ్రెనియాకు సిజో.ఎం.పి. అనే జన్యువు కారణమవుతోందని సంస్థ పరిశోధకులు గుర్తించారు. ఈ పరిశోధనల కోసం శాస్త్రవేత్తలు చేస్తున్న కృషిలో ఇదొక ముందంజగా పేర్కొనవచ్చును. మానవదేహంలోని 30-40 జన్యువులు మానసిక వ్యాధుల వ్యాప్తిలో దోహదపడుతున్నాయని ఆ పరిశోధనలు తేల్చాయి. ప్రస్తుతం ఆయా జన్యువుల జెనిటిక్ ప్రొఫైల్‌ను రూపొందించడంలో శాస్త్రవేత్తలు నిమగ్నమయివున్నారు. ఇదీ విజయవంతమయితే మానసిక వ్యాధులలో అత్యంత సమస్యాత్మకమైన స్కిజోఫ్రెనియాను నిరోధించే రోజు ఇంకా ఎంతో దూరం లేదు అనడంలో అతిశయోక్తి లేదు. ★

# మీ గుండె గురించి మీకు తెలుసా?

**మన** గుండెలో నాలుగు గదులు ఉంటాయి. పై రెండు గదుల్ని 'ఎట్రియాలు' అంటారు. క్రింది రెండు గదుల్ని 'వెంట్రికిల్స్' అంటారు. రెండు ఎట్రియాల మధ్య నుండే గోడను 'ఎట్రియల్ సెప్టమ్' అంటారు. అలాగే రెండు వెంట్రికిల్స్ మధ్యగల గోడను 'వెంట్రిక్యులర్ సెప్టమ్' అంటారు. ఎట్రియల్ సెప్టమ్‌లో రంధ్రాలుంటే దానిని ఎట్రియల్ సెప్టెల్ డిఫెక్టు అని, వెంట్రిక్యులార్ సెప్టమ్‌లో రంధ్రాలుంటే దానిని వెంట్రిక్యులార్ సెప్టెల్ డిఫెక్టు అని అంటారు. గుండెలో రంధ్రాలున్నాయంటే ఇవే.



ప్రపంచవ్యాప్తంగా ఒక కోటి ఇరవై లక్షల మంది ఏటా హృదయ సంబంధ వ్యాధుల కారణంగా మరణిస్తున్నారు. అందులో 24 లక్షల మంది ఒక్క భారతదేశంలోనే మరణిస్తున్నారు. వీరిలో 18 లక్షల మంది హాస్పటల్ ముఖం చూడకుండా అర్ధాంతరంగా అకాల మృత్యువాత పడుతున్నారు. ప్రస్తుతం దేశంలో సుమారు నాలుగు కోట్ల మంది ఏదో ఒక గుండె సంబంధం జబ్బుతో బాధపడుతున్నారట. దేహంలోని అసంఖ్యాకమైన కణాలకు అత్యావశ్యకమైన 'ఆక్సిజన్' రక్త ప్రసరణ ద్వారా అందుతుంది. ఈ రక్త ప్రసరణలో ప్రధాన అవయవం గుండె. ఛాతిలో ఎడమవైపున ఉండే ఈ గుండె మగవారిలో 300-350 గ్రాములు, ఆడవారిలో 250-300 గ్రాములు బరువు కలిగి వుంటుంది. ఇది నిర్విరామ, క్రమబద్ధ సంకోచ వ్యాకోచాల ద్వారా రక్తాన్ని 'పంప్' చేస్తున్న కారణంగా రక్త ప్రసరణ జరుగుతున్నది. అయితే కొన్ని హృదయసంబంధ వ్యాధుల కారణంగా ఈ సాధారణ క్రమబద్ధ హృదయ చలనంలో అసాధారణ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఫలితంగా ఆ వ్యక్తుల ఆరోగ్యం లయ తప్పుతోంది. అభివృద్ధి చెందిన దేశాలలో రక్తపోటు తద్వారా వచ్చే 'గుండెపోటే' మరణాలకు కారణం అవుతుండగా, మన దేశం వంటి వర్ధమాన దేశాలలో రక్తపోటుతోపాటు, పుట్టుకతో వచ్చే గుండెజబ్బులు, రుమాటిక్ గుండె జబ్బులు మరణాలకు కారణమవుతున్నాయి. పాశ్చాత్య దేశాలలో మద్యపానం, ధూమపానం, అధిక కొవ్వు పదార్థాలుండే ఆహారం తీసుకోవడం, శరీరానికి తగిన వ్యాయామం లేకపోవడం వంటివి రిస్క్ ఫ్యాక్టర్స్‌గా వుండగా, ప్రాచ్యదేశాలలో వాటితోపాటు, పేదరికం, నిరక్షరాస్యత, అపరిశుభ్రత, వైద్య సదుపాయాల కొరత వంటివి కూడా రిస్క్ ఫ్యాక్టర్స్‌గానే పరిణమించాయి. ప్రస్తుతం మన దేశంలో 60 లక్షల మంది రుమాటిక్ గుండె జబ్బుతో బాధపడుతున్నారు. బీదరికం, పారిశుధ్యలోపం, పోషకాహార లోపం, నిరక్షరాస్యత, నిర్లక్ష్యం కారణంగా ఈ రుమాటిక్ వ్యాధి మన దేశంలో ఎక్కువ కనిపిస్తుంది. చివరకు ఏ హృదయ సంబంధ వ్యాధి అయినా గుండెకే ముప్పు తెస్తుంది. ఈ వ్యాధుల కారణంగా సహజ హృదయ స్పందనలో మార్పులొచ్చి, గుండెకు రక్త సరఫరా తగ్గడమో, గుండె రక్తాన్ని సరిగా పంప్ చేయలేకపోవడమో జరిగి చివరకు హార్ట్ ఎటాక్‌గానో, హార్ట్ ఫెయిల్యూర్‌గానో బయటపడి ప్రాణాన్ని బలితీసుకుంటుంది. ★

## దంత సంరక్షణ క్విజ్-5

నిర్వహణ: డా॥ కె.ఎల్.వి. ప్రసాద్,
హన్మకొండ

1. దవడలలో 'పంటి అమరిక' ను సూచించే ఫార్ములా
   - అ) టూత్ ఫార్ములా
   - ఆ) డెంటిషన్ ఫార్ములా
   - ఇ) డెంటల్ ఫార్ములా
   - ఈ) దవడ పంటి ఫార్ములా

2. డెంటల్ ఫార్ములా ప్రకారం మూసివున్న రెండు దవడలను ఈ విధంగా విభజించవచ్చు
   - అ) నాలుగు భాగాలు
   - ఆ) మూడు భాగాలు
   - ఇ) ఐదు భాగాలు
   - ఈ) ఆరు భాగాలు

3. పై దవడ (మాక్సిలా)ను రెండు భాగాలుగా విభజిస్తే, మధ్య నుంచి కుడివైపు ఉన్న దంతాలు, మధ్య నుంచి ఎడమవైపు ఉన్న దంతాలకు
   - అ) సమానంగా వుంటాయి.
   - ఆ) సమానంగా ఉండవు.
   - ఇ) వేరు వేరుగా ఉంటాయి.
   - ఈ) పైవన్నీ తప్పే

4. కింది దవడకు సంబంధించిన 'టి.యమ్.జె' చివరి భాగం గుండ్రంగా వుండి, ఒక గిన్నెవంటి ----భాగంలో అమరి వుంటుంది. దీనిని
   - అ) కీలుబంతి అంటారు.
   - ఆ) కరోనాయిడ్ ప్రాసెస్ అంటారు.
   - ఇ) కాండైల్ అంటారు
   - ఈ) పైవన్నీ తప్పే.

5. 'దవడ' పైకి - కిందికి ప్రక్కలకు తిరగడానికి ఉపయోగపడే ముఖం మీద కండరాలను సాంకేతికపరంగా ఈ విధంగా పిలుస్తారు.
   - అ) లాఫింగ్ మజిల్స్
   - ఆ) మూవింగ్ మజిల్స్
   - ఇ) ముఖ కండరాలు
   - ఈ) మజిల్స్ ఆఫ్ మాస్టికేషన్

6. పై దవడలోను, క్రింది దవడలోను, మొత్తం విసురుదు దంతాల (మోలార్స్) సంఖ్య:
   - అ) పది
   - ఆ) పదహారు
   - ఇ) పదకొండు
   - ఈ) పన్నెండు

7. పై దవడలోను, కింది దవడలోను మొత్తం 'జ్ఞానదంతాల' సంఖ్య
   - అ) ఎనిమిది
   - ఆ) ఆరు
   - ఇ) పన్నెండు
   - ఈ) నాలుగు

8. స్థిర దంతాలలో కన్పించే 'చిన్న- విసురుదు' దంతాలను సాంకేతికంగా ఈ విధంగా పిలుస్తారు.
   - అ) స్మాల్- మోలార్స్
   - ఆ) డ్వార్ఫ్ - మోలార్స్
   - ఇ) ప్రి- మోలార్స్
   - ఈ) పోస్ట్- మోలార్స్

9. రెండు దవడలలోను వుండే మొత్తం 'చిన్న-విసురుదు దంతాల' సంఖ్య:
   - అ) ఆరు
   - ఆ) ఎనిమిది
   - ఇ) పది
   - ఈ) పన్నెండు

10. చీల్చే గుణం గల పళ్ళను ఈ విధంగా పిలుస్తారు.
    - అ) మోలార్స్
    - ఆ) ప్రి- మోలార్స్
    - ఇ) ఇన్సిజార్స్
    - ఈ) కెనైన్స్

జవాబులు:
1) ఇ 2) అ 3) అ 4) ఇ 5) ఈ
6) ఈ 7) ఈ 8) ఇ 9) అ 10) ఈ

**పుస్తక పరిచయం**

# 'విమర్శ - వివేచన'

విమర్శ ప్రక్రియ పాశ్చాత్య సాహిత్య ప్రభావ ఫలితంగా రూపొందినట్లు చెబుతారు. అయితే సాధారణ విమర్శవేరు. సాహిత్యవిమర్శ వేరు. ఈ గ్రంథం 'విమర్శ - వివేచన' సాహిత్య విమర్శకు సంబంధించినది. కాబట్టి దాని గురించే ప్రస్తావిద్దాం! డాక్టర్ వెలమల సిమ్మన్నగారు దూరవిద్యాకేంద్రం తెలుగుశాఖలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉన్నారు. ఆయన ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఒక ఆశాకిరణం. నేటిదాకా 21 గ్రంథాలు రచించారు. ఎన్నో బహుమతులు గెలుచుకున్నారు. ఆయన కలం నుండి జాలువారిన ఈ గ్రంథం నేడు డిగ్రీ స్పెషల్ తెలుగు విద్యార్థులకే గాకుండా, పి.జి. తెలుగు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పొచ్చు. అందుకు కారణం సిమ్మన్నగారి శైలి ఈ గ్రంథంలో సరళ వ్యవహారికంలో సాగడమే!

ఈ పుస్తకంలో మౌలికమైన పదకొండు వ్యాసాలు చోటుచేసుకున్నాయి. అన్నీ విమర్శ - వివేచన నేపథ్యంతో వ్రాసినవే! విమర్శకు సంబంధించి మొదటి ఐదు వ్యాసాలు ప్రామాణికాలై దర్శన మిస్తాయి. చివరి మూడూ మాత్రం కావ్యాత్మ, కావ్యవస్తువు, కావ్య ప్రయోజనాలకు సంబంధించినవి. లలిత కళలకు చెందినవి, 'త్రివిధ శబ్దవృత్తులు', ధ్వని భేదాలకు సంబంధించిన వ్యాసం... ఇవి అన్నీ కూడా సాహిత్య విమర్శలో అవాంతర విభాగాలేనన్న సత్యం మనం గ్రహించవచ్చు.

ఒక కథో, నవలో, నాటకమో వ్రాయడం ఒక ఎత్తు. లక్ష లక్షణాలతో వ్యాకరణ, విమర్శనాత్మక గ్రంథాలు వ్రాయటం మరో ఎత్తు. ఇది కత్తిమీద సాములాంటిది. పాశ్చాత్య విమర్శకులైన బెన్‌జాన్సన్, టి.ఎస్, ఇలియట్, డ్రైడన్, సిన్స్, మాత్యూ ఆర్నాల్డ్, మోడ్సన్, ఐ.ఏ. రిచర్డ్స్ వంటి వారు చెప్పిన అంశాలను ఉటంకిస్తూ ప్రాచ్య విమర్శకులైన, అందునా తెలుగువారైన ఆచార్య పింగళి లక్ష్మీకాంతం, వీరేశలింగం, దివాకర్ల వెంకటావధాని, సి.నా,రెడ్డి, కట్టమంచి రామలింగారెడ్డి మొదలైన వారి విమర్శ గురించిన అభిప్రాయాల్ని వెల్లడించారు గ్రంథరచయిత. ఇంకా పద్ధతులు గురించి చెబుతూ ప్రాచీన, ఆధునిక, అస్వతంత్ర, స్వతంత్ర విమర్శల గురించి కూడా ఏకరువు పెట్టారు.

లలిత కళల ప్రాశస్త్యం గురించి కూడా సోదాహరణంగా వివరించిన తీరు బాగుంది. ఇంకా అబిధ, లక్షణ, వ్యంజన- అనే త్రివిధమైన వృత్తులు గురించి, ధ్వన్యాలోక సంబంధమైన ధ్వని అవాంతర విభాగాలను గురించి, శబ్దశక్తి వఖాలాలో విటని వివరించిన తీరు బాగుంది. కవుల కావ్యాలకు సంబంధించి మూడు చివరి వ్యాసాల్లో ఆ సిద్ధాంతకర్తల గురించి, గ్రంథాలయం గురించి చెప్పినతీరు ఎంతో ఇన్ఫర్మేటివ్‌గా వుంది.

'విమర్శ-వివేచన'
**రచయిత:** వెలమల సిమ్మన్న
**ప్రచురణ:** దళిత సాహిత్య పీఠం
**వెల:** రూ. 150/-
**పేజీలు:** 200
**ప్రతులకు:**-విశాలాంధ్ర, ప్రజాశక్తి అన్ని బ్రాంచీలు నవయుగ, నవోదయ బుక్‌హౌస్‌లు - హైదరాబాదు.

'విమర్శ-వివేచన' గ్రంథం ఒక్కసాహిత్యాధయనం చేసేవారికే ఉపకరించేది అనేకాకుండా సామాన్యుడైన చదువరికికూడా బోధపడేలా దీనిని రచయిత మలిచారు. డా॥ వి.సిమ్మన్న గారు ఇటువంటి రచన లెన్నింటినో చెయ్యగలరని కోరుకుందాం.!

**డా॥ మంతెన**

# స్వీకారం

**భర్తృహరి సుభాషితాలు**
ఎన్.వి. బ్రహ్మం
వెల: రూ. 40/-
పేజీలు: 72
ప్రతులకు: మనీషా విద్యావిహార్, చీరాల
ప్రముఖమైన పుస్తకాల షాపులు

**సౌరభం**
శ్రీలేఖ సాహితి
వెల: రూ. 80/-
పేజీలు: 123
ప్రతులకు: విశాలాంధ్ర అన్ని బ్రాంచీలలో
శ్రీ లేఖ సాహితీ, ఎం.ఆర్.ఓ ఆఫీస్ ఎదుట, హసన్‌పర్తి

**మానవ మాణిక్యం**
గంధం సుబ్బారావు
వెల: రూ. 100/-
పేజీలు: 180
ప్రతులకు: దివి ఐతిహాసిక పరిశోధక మండలి
గాంధీక్షేత్రం - అవనిగడ్డ
కృష్ణాజిల్లా - ఆంధ్రప్రదేశ్

# 'ఎవరున్నా లేకున్నా'

**జీ**విత అనుభవాల మోహపూరిత జ్ఞాపికలు 'ఎవరున్నా లేకున్నా' కవితా సంపుటిలో పుష్కలంగా దొరుకుతాయి. మనస్సు పొరల్లో దాగిన అనుభూతి దార్శనికత **ముకుంద రామారావు** కవితల్లో కనిపిస్తుంది.

*"ఉద్యోగంలో ఉన్నపుడు/ పగలు చాలా పొడవుగా/రాత్రులు మరీ పొట్టిగా/రాత్రి పగలు లేనిరోజు/ఎప్పుడొస్తుందో...*

ఇలా తాత్వికతలో జీవితాన్ని లోకాన్ని పరిశీలించే దృష్టి కవిత్వ భాషలో మిళితం చేశారు కవి.

*'బహుశా ముసలితనం/వాయిదాల మరణం/ఎవరేమిటో*

లోతుగా తెలుసుకొనే సమయం మనసు రెపరెపల సవ్వడిని లౌకిక వాస్తవ విషాద స్వరాలలో వినిపిస్తారు.

పరాయికరణలో మనల్ని మనం దూరం చేసుకొన్ని వైనాన్ని *'ఎన్నెన్నో జ్ఞాపకాల గోడల్లా పిల్లలున్నా ఇల్లంతా ఎంత శూన్యం"* అంటూ దగా పడిన జీవితాల్ని సాదృశ్యం చేశారు.

*'భయం బాధ /దుఃఖం గాయం/ఆ పదాలే వద్దంటాడు మిత్రుడు'*

అన్యాపదేశంగా నూతన వాక్య నిర్మాణానికి సందేశాన్నిస్తూ అనుభవమే భాషగా మారుతుందని సూత్రీకరిస్తూ, అనుభవంలోకి రాని విషయాలు తెలియని పార్శ్వాలను వ్రాయటం ఇష్టంలేదు కవికి.

*'అర్థంకాని అక్షరాలు/వాక్యాంత విరామాలు/విచిత్ర శబ్ద విన్యాసాలు'*

వద్దంటారు ముకుంద రామారావు. ఈయన కవిత్వంలో తాత్వికత అంతర్లీనంగా వుంటుంది. మాటల పొదుపు ముకుంద రామారావు ప్రత్యేకత. వ్యక్తిత్వాల పరిశీలన, జీవితంలోని సంఘటనలు కవిత్వాంశాలై రసమయ ప్రక్రియగా రూపాంతరమైంది.

*చీకటి వెలుగుతో/తుడుచుకుంటూ/ నిద్రలేవడమే/ఉదయం* అంటారు కవి. ముకుంద రామారావు కవిత్వాన్ని ఎవ్వరైనా హాయిగా చదువుకోవచ్చు.

*'ఎవరున్నా లేకున్నా/పూచేపూలు పూస్తూనే వుంటాయి'* అన్నది ముమ్మాటికి నిజం.

**-డా॥ ధేనువకొండ శ్రీరామమూర్తి**

**ఎవరున్నా లేకున్నా**
ముకుంద రామారావు
వెల: రూ. 50/-
పేజీలు: 59
ప్రతులకు: నిశిత పబ్లికేషన్స్, 1-7-23/1, హబ్సీగూడ, హైదరాబాద్.

# అద్భుత కట్టడాల జైపూర్ కోట

*భారతదేశంలోని అతి ప్రాచీనమైన ఆరావళి పర్వత శ్రేణుల మధ్య సమున్నతంగా నిర్మితమైన అద్భుత కట్టడాల సమాహారం జైపూర్ ఫోర్ట్. నాగరికత, సంస్కృతుల పరిణామక్రమానికి అద్దంపట్టే ఆసియా, ఈజిప్ట్, చైనా, రోమ్ శిల్పరీతుల సమ్మేళనం ఈ కోట.*

**సిహెచ్.వి.వి. రఘుబాబు**

కౌటిల్యుని అర్థశాస్త్రం, శిల్పశాస్త్రం, ముక్తికల్ప సూత్రం, మన్సర శిల్ప శాస్త్రం ఆధారంగా కోటలను ఆరు విభాగాలుగా వర్గీకరించారు. వీటిలో జైపూర్‌కోటను పర్వత దుర్గ విభాగంలో చేర్చారు. మనుధర్మ సూత్రాల ప్రకారం చూస్తే పర్వత దుర్గమే అన్నిటిలో అత్యుత్తమైనది.

క్రీస్తుశకం 954 నాటి లిపిలను కూడా ఇక్కడ చూడవచ్చు. మీర్జా రాజా జైసింగ్ ఆధ్వర్యంలో ప్రారంభమైన జైపూర్ కోట నిర్మాణం సనాయ్ జైసింగ్-2 హయాంలో పూర్తి రూపాన్ని సంతరించుకుంది. భూతలం నుంచి 500 అడుగుల ఎత్తున మూడు కిలోమీటర్ల వైశాల్యంలో విస్తరించిన ఈ కోట అడుగడుగునా చారిత్రక సుగంధాలను పరిమళిస్తుంటుంది. పడమర భాగంలో నగారి ద్వారం నుంచి ప్రవేశిస్తే విశాలమైన జలేబ్‌చౌక్ కనిపిస్తుంది. దానిని దాటి ముందుకు వెళితే సుభత్‌నివాస్ వస్తుంది. విశాలమైన ఈ ప్రాంగణాన్ని మహారాజులు సైనికాధికారులతో సమావేశమై యుద్ధ వ్యూహాలను రూపొందించడానికి, సైనికులకు సందేశాలివ్వడానికి వినియోగించేవారు. 18 స్థంభాలతో ఆకర్షణీయమైన ఆర్చిలతో సుభత్‌నివాస్ అలరిస్తుంది. ఇక్కడి నుంచి ఖిల్‌బతీనివాస్‌కు అత్యవసర సందర్భాలలో సైనికులు సురక్షితంగా తప్పించుకునేందుకు సొరంగ మార్గం కూడా ఉంది. ఖిల్‌బతీనివాస్‌లోనే మరో భాగాన్ని రాజ్యంలో పౌరులు తమ సమస్యలు చెప్పుకునేందుకు కేటాయించారు. నిర్ణీత సమయంలో రాజుగారు హాజరై వారి బాధలు వినేవారు. దీనిలోని కొంత భాగాన్ని లక్ష్మీనివాస్‌గా వ్యవహరిస్తారు. కోట లోపలి మొత్తం భద్రతా వ్యవహారాలన్నీ నియంత్రించే సిబ్బందికి ఇది కార్యాలయ ప్రాంతం. తీరిక వేళల్లో సైనికాధికారులతో పాటు మహారాజులు కూడా నృత్య, గాన, కేళివిలాసాలతో పాటు విందు భోజనాలను కూడా ఇక్కడ స్వీకరించేవారు. కోట ముందరి భాగంలో జలాశయం ఉంటుంది. పడమర వైపు ప్రాంతంలో అత్యద్భుతంగా తీర్చిదిద్దిన ఉద్యావనం (రణవత్నీ-క-బాగ్) వచ్చదనంతో మెరుస్తుంటుంది. ఉదయపూర్ మహారాజా కుమార్తె మహారాణి చంద్రకుమార్ రణపత్నీ స్మృత్యర్థం 1729లో దీనిని సవాయ్ జైసింగ్-2 నిర్మించారు. కోట పైభాగం నుంచి పరిసరాల్ని చూస్తే ఆరావళి పర్వత శ్రేణులే గంభీరంగా కనిపిస్తాయి. ఈ కోట నిర్మాణం యావత్తు శాస్త్రీయ విధానంలో జరగడం ఒక విశేషం కాగా గాలి, వెలుతురు వంటివి చక్కగా వచ్చేటట్లుగా సాగిన ప్రత్యేక కట్టడాలు శీతాకాలంలో వెచ్చగా, వేసవి కాలంలో చల్లగా ఉండే కొన్ని గదులను పరిశీలించినపుడు ఆశ్చర్యం కలగక మానదు. కింది నుంచి కోటపైకి వెళ్లాలంటే జీపుల్లో మాత్రమే అవకాశం ఉంటుంది. ప్రధాన ద్వారాన్ని దాటి లోనికి ప్రవేశించగానే ఆకర్షణీయంగా అలంకృతమైన ఏనుగులు ఆహ్వానం పలుకుతాయి. గైడ్ సహకారం లేకుండా కోట లోపల తిరుగాడితే ఎటు నుంచి ఎక్కడకు వచ్చామా గందరగోళానికి గురయ్యే అవకాశం ఉంది. ఈ మొత్తం కోటను పూర్తిగా చూడాలంటే కనీసం ఒక రోజు పడుతుంది. అంబర్ ప్యాలెస్, అవాసి గేట్‌లు తప్పనిసరిగా చూడవలసిన భాగాలు. కొన్ని గదులకు ఏర్పాటు చేసిన తలుపులు చందనంతో తయారుచేసినవి కావడం విశేషం. రాజవంశీయుల వస్తువులు, ఉపకరణాలన్నింటితో సిటీ ప్యాలెస్‌ను మ్యూజియంగా తీర్చిదిద్దినప్పటికీ జైపూర్ కోటను సందర్శించడం మరపురాని అనుభూతి. దేశంలోని అన్ని ఫోర్ట్‌లలో జైపూర్ ఫోర్ట్ మాత్రమే ఆకర్షణీయంగా ఉంటుంది. ఇప్పటికీ సందర్శకుల సంఖ్య ఇక్కడే ఎక్కువ. ఈ ప్రాంతానికి ఢిల్లీ నుంచి రైలు, బస్, విమాన సౌకర్యాలున్నాయి. వివిధ ట్రావెల్ ఏజెన్సీలవారు మినీబస్‌లు, టూరిస్ట్‌బస్‌లు ఏర్పాటు చేస్తారు. ★



# విస్మృత మధుర స్వరం
# మన్నాడే



**హిందీ సినిమా రంగంలోని గాయకుల నడుమ మన్నాడే ప్రస్తావన వచ్చినపుడు ఏవిధంగా చూసినా ఆయన సర్వోత్తమ గాయకుడే. హిందీ గాయకత్రయం రఫీ, ముఖేష్, కిశోర్‌లతో పోలిస్తే ఈయన ప్రతిభను తక్కువగా అంచనా వేయలేము. కానీ వారికి వచ్చిన పాపులారిటీ మన్నాడేకు రాలేదు. కారణం సినీ రాజకీయాలేననిపిస్తుంది. ఇటీవల వారిని కేంద్రప్రభుత్వం "పద్మభూషణ్" పురస్కారానికి ఎంపిక చేసింది.**

హెచ్. రమేష్ బాబు

**1920** మే1న. పశ్చిమ బెంగాల్‌లో మన్నాడే పుట్టారు. అసలు పేరు 'ప్రబోధ్ చంద్ర దే' ఇంట్లో ముద్దుగా పిలుచుకునే "మన్నాడే" పేరే పాపులర్ పేరైంది. సంగీతంలో తొలిపాఠాల్ని చిన్నాన్న కిశోర్ చంద్రదే వద్ద నేర్చుకున్నారు. తర్వాత ఉస్తాద్ అబ్దుల్ రెహమాన్‌ఖాన్ వద్ద చేరి శాస్త్రీయ సంగీతంలోని మెళకువలను అభ్యసించారు. ఈ శాస్త్రీయ సంగీత జ్ఞానమే సాటి సినీ గాయకుల నుండి దూరం చేసింది. మన్నాడే సినిమాల్లో తొలుత పాడింది "తమన్నా (1942) చిత్రంలో. అదే ఏడాది వచ్చిన విజయ్‌భట్ 'రామ్‌రాజ' లోనూ పాడారు. కానీ ఆయన పాటల్ని ఎవరూ అంతగా పట్టించుకోలేదు. కె.సి.డే అందించిన ప్రోత్సాహం అవకాశాల్ని తెచ్చిపెట్టలేదు. పైగా ఆయన పాడే విధానంలో శాస్త్రీయ సంగీతం పోకడలు సినిమాలకు పనికి రావని వ్యాపార సినిమా సంగీత దర్శకులు ముఖంపైనే చెప్పారు. దీంతో బొంబాయి తిరిగి వెళ్లిపోవాలనుకున్నారు. ఆ దశలో ఇష్టాలో పని చేస్తూనే అసిస్టెంట్ మ్యూజిక్ డైరెక్టర్‌గా చాలా చిత్రాలకి పని చేసారు. 1950లో ఎస్‌డి బర్మన్ 'మషాల్' లో పాడిన పాటతో ఆయనకు కాస్త గుర్తింపు వచ్చింది. తర్వాత సచన్‌దాగారు "నౌ జవాన్"లో అవకాశ మిచ్చారు. ఆ తర్వాత అనిల్‌బిస్వాస్ ప్రోత్సాహం ఆయన భవిష్యత్‌కు బాట చూపింది. 'మషాల్'లోని మార్చింగ్‌సాంగ్ "ఊపర్ గగన్ విశాల్" నిజంగా సూపర్ హిట్.

మన్నాడే సినిమాల్లోకి వచ్చేనాటికి రఫీ, తలత్, ముఖేష్, హేమంత్‌లు తారాస్థాయిలో ఉన్నారు. వీరంతా అభిమాన గాయకులే ఆయనకు. మరోవైపు అప్పటి హీరోలందరికీ పర్మినెంట్ గావాలనుకున్నారు. మన్నాడేకి ఫలానా అనే ప్రత్యేక హీరోలేడు. అందరికీ నప్పేలా పాడగలడాయన. ఇది ఎంత కలిసివచ్చిందో అంతలా లోపమై కూర్చుంది. ముద్రలేకపోవడంవల్ల అవకాశాలు తగ్గాయి.



తొలుత మన్నా వాయిస్ తనకు నప్పుతుందని గుర్తించినది రాజ్‌కపూర్. ఐతే మొదటి ప్రాధాన్యత ముఖేశ్ ఇచ్చారు రాజ్. అందుకే శ్రీ 420 లో అన్నీ ముఖేశ్ పాడగా మన్నాకి "దిల్ కా హాల్ సునే దిల్‌వాలా" మరొకటి మిగిలింది. అయినా రాజ్‌కి పాడిన "ఆజాసనమ్ మధుర్' (చోరీచోరీ), "లాగా చునరి దాగ్" (దిల్‌హితోహై), ఏ భాయ్ జర దేఖ్ చలో (మేరానామ్ జోకర్) "శ్రీ420"లో పాడిన "ప్యార్‌హువా నా ఇక్‌రార్ హువా" పాట నేటికీ హిట్‌సాంగ్సే. రాజ్ నిర్మించిన "బూట్‌పాలిష్"లో దర్బారీ రాగంలో పాడిన "లపక్ దుపక్ తూ ఆరే బదర్‌వా" సాంగ్ మన్నా బెస్ట్ సాంగ్స్‌లో ఒకటి.

రాజ్‌కపూర్ పర్మినెంట్ మ్యూజిషియన్స్ శంకర్ జైకిషన్‌లు ముఖేశ్‌తో పాడించినా, మన్నా పాడాల్సిన పాట ఉంటే తప్పకుండా ఆయన్నే పాడమనేవారు. "ఏ రాత్ భీగీ భీగీ", "రాత్‌గయీ దిన్ ఆతా హై" పాటలు అలాంటివే. అశోక్‌కుమార్‌కి 'బాబూ సంఘే ఇషారే' (చల్తీకా నాం గాడి) రాజేశ్ ఖన్నాకి 'హుస్నెకె చాహ్‌నే. ఇత్‌నా ముఝే, రులాయాహై" (ఆవిష్కార్), సంజీవ్‌కుమార్‌కి "ఆప్ నే లియే జిమ్‌తో క్యా జియే (బాదల్), రాజ్‌కుమార్‌కి "ఝునక్ ఝునక్ బాజే పాయలియా (మెరే హుజూర్), బాల్రాజీ సహానికి ((ఐ మెరీ జుహర జబీ తుఝె మాలూమ్ నహీ తు అభితక్ తొ హసీ ఔర్ మై జవా" (వక్త్) ప్రాణ్‌కి "యారీహై ఈమాన్ మేరి యారి మేరీ జిందగి" (జంజీర్), భరత్ భూషణ్‌కి తోడి రాగంలో "సుర్‌నా సజే క్యా గావూ మై" (బసంత్ బహార్) వంటివి పాటలతో నటులతో వేరుచేయలేని స్వరసామ్రాట్ మన్నాడే.

మన్నాడేకి ఎక్కువ అవకాశాలచ్చినవారు ఖయ్యాం, ఓ.పి.నయ్యర్. మదన్‌మోహన్‌లు. మదన్‌మోహన్ సలీల్‌దాకు ఇష్టమైన గాయకుడు మన్నాడే.

ఆషాతో కలిసి మన్నాడే 'జుల్ఫోంకా ఘటా" (రేష్మీరుమాల్), గీతాదత్‌లో "మై తెరే ప్యార్ మె క్యా క్యా నబనూ దిల్‌బర్" (జిద్దీ), లతతో "దిల్‌కి గిరహ్ ఖోల్‌దో" (రాల్ ఔర్ దిన్), "యేరాత్ భీగీ భీగీ" (చోరీ చోరీ)

పాటలకు ప్రాణంపోశారు. అయితే 'పడోసన్'లో మన్నా శాస్త్రీయ సంగీత పోటీలో కిశోర్‌తో ఓడిపోవాల్సిన వెర్షన్ పాడమని మెహమూద్ అడగ్గా మొదట కాదన్నారు. కానీ చివరికెలాగో అంగీకరింపజేశాడు మెహమూద్. నిజానికి ఆయన సింగింగ్ కెరీర్‌కూడా పరిస్థితులతో రాజీపడి సాగిపోయినదే. అయితే పాడినపాటలు మాత్రం అజరామరం.

మన్నాడే సినీజీవితంలో మరో విషాదమేమిటంటే అందరు హీరోలకు పాడినా ఈయన కమెడియన్ల, ముసలి పాత్రలకు పాడే గాయకునిగా ముద్రపడటం. "నేను అన్ని పాత్రలకు పడగలనని ఇండస్ట్రీలో అందరికీ తెలుసు. కానీ నాకు అవకాశాలే ఇవ్వలేదు" అనంటారు మన్నాడే. అయితే "ఏక్ చతుర్ నార్ కర్ కె సింగార్" (పడోసన్) పాట ఆయన ప్రజ్ఞకి దర్పణం. 'ఏ మెరే ప్యార్ వతన్' (కాబూలీవాలా), ఝనక్ ఝనక్ పాయెల్ బాజే పాయలియా (ఏక్‌ఫూల్ చార్ కాంటే), ఫూల్ గేందవాన మాగో (మంజిల్) నతో కార్‌వాకీ తలాష్" (బర్సాత్ కి రాత్) ఖవ్వాలీ పాటలు మన్నాడేని ఉన్నత శిఖరంపై నిలిపాయి.

మన్నాడే గాయకుడిగానే కాదు. వ్యక్తిగా కూడా ఉన్నతుడు. మలయాళ అమ్మాయి సులోచనని వివాహమాడారు. ఠాగోర్ గీతాలను అభిమానించే ఆమె ప్రోత్సాహం వల్లనే తానింత గొప్ప గాయకుడనైనానంటారు. మలయాళంలోని 'చెమ్మీన్' లో "మానసమైన వరు'' పాట పాడారు. 1980లో ప్రఖ్యాత హరివంశరాయ్ బచ్చన్ 'మధుశాల' ప్రైవేట్ అల్బం కూడా పాడారు. 1990లోనే రణగొణధ్వనుల నడుమ పాడలేక సినిమాకు దూరంగా స్వర సాధనలో మునిగి తేలుతున్నారు.

మన్నాడే 'మేరే హుజూర్' "మేరానామ్ జోకర్" (ఏ భాయ్ జరా దేఖ్‌కె చలో-పాట) హిందీ, "నిష్టిపాద" బెంగాలీ చిత్రాల్లో పాడి జాతీయ అవార్డు, ఫిలింఫేర్ అవార్డులు, జి.టి.వి టైం అఛీవ్‌మెంట్ అవార్డు, చాలా ఏళ్ల క్రితం పద్మశ్రీ, ఇపుడు 'పద్మభూషణ్' అవార్డులు ఆయన్ను వరించి తమ గౌరవాన్ని పెంచుకున్నవే. 2002లో ఆయన జన్మదినంనాడు ఆయనపై "అమి" (నేను) అనే డాక్యుమెంటరీ బెంగాలీలో వెలువడింది.

చివరిగా అనిల్ బిస్వాస్ మాటల్లోనే చెప్పాలంటే "ఇతర గాయకులు పాడిన పాటలు మన్నాడే అవలీలగా పాడగలడు. కానీ మన్నాడే పాడిన పాటలు మరెవరూ పాడలేరు." అయితే మనసును మీటే మధురమైన పాటలు పాడిన మన్నాడేను మాత్రం బాలీవుడ్ నిర్లక్ష్యం చేసింది.

★

# విప్లవ సౌందర్యస్ఫూర్తి

బీభత్సాల చరమగీతానికి
శ్రామిక విప్లవాల యుగశీర్షిక – మేడే
బీభత్సాల్లో పుట్టిన సౌందర్యం – మేడే
ప్రకృతి బీభత్సాల్ని తొలగించి సౌందర్యాల్ని తీర్చిదిద్దేది శ్రమజీవులు
సామాజిక బీభత్సాల్ని నిర్మూలించి
సుందర సమతా వనాలను నిర్మించేది ఉద్యమకారులు, వీరులు.
త్యాగధనులు –వారే నిజమైన సౌందర్య రాశులు
బీభత్సాల్ని సౌందర్యాల్ని కవులు సృష్టించరు
ప్రకృతిలోనూ, సమాజంలోనూ యిమిడివున్న ఆవిష్కరించుకున్న
బీభత్సాల్ని, సౌందర్యాల్ని ప్రతిబింబిస్తారు. గానం చేస్తారు.
కవులు ఆకాశం నుండి ఊడిపడరు
వారు మానవ చైతన్య ప్రతీకలు, ప్రతినిధులు
మానవ సమాజం భూమయితే... సాహిత్యం ఊటబావి
సాహిత్యం నీరయితే... కవిత్వం ఎగిసిపడే కెరటం
సామాజిక బీభత్సాన్ని నిర్మూలించుకునే,
జీవితాన్ని మరింత సౌందర్యవంతం గావించుకునే
నిరంతర భావావేశాన్ని కవులు రగిలిస్తారు
నూతన సౌందర్యాల సృష్టికి పరోక్ష ప్రేరకులౌతారు
ఈ కర్తవ్య నిర్వహణలోనే కవితా సౌందర్యం యిమిడివుంది
కవులు నూతన యుగ దీక్షాదినంగా మేడే స్ఫూర్తిని మన గుండెల్లో ప్రతిష్టిస్తారు
నూట పదిహేడేళ్ల చరిత్రలోని బీభత్సాలను ఖండిస్తారు.
సౌందర్యాత్మక సమతాభావాలను పండిస్తారు
మేడే త్యాగాల స్ఫూర్తిని అరుణపతాకగా రెపరెపలాడిస్తారు
దోపిడీ బీభత్సాల పునాదులపై నిలిచిన పెట్టుబడిదారీ యుగానికి
కాలం చెల్లిందని ప్రకటించిన "సత్యం" మేడే.
సమస్త మానవ బీభత్సాల కేంద్రకమైన సామ్రాజ్యవాదాన్ని
తుత్తునియలు గావించే అర్థవంత (శివ) మైన
కార్యాచరణకు స్ఫూర్తి ప్రదాత మేడే!
మేడే... నూతన యుగావిష్కరణకై అలుపెరుగని ఆశావహమైన ఆర్తి!
అది నిరంతరాయ విప్లవ సౌందర్య స్ఫూర్తి!!

– దివికుమార్

# న్యాయసలహాలు

జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది

## లేబర్‌కోర్టులో కేసువేయండి

నేను 2000 సంవత్సరం జనవరి 24తేదిన వాసవి బ్యాంకులో ఉద్యోగములో చేరాను. నేను పర్మినెంట్ ఉద్యోగిగా అప్పాయింట్ అయినా లాభం లేకపోయింది. నాకు ఒక నెల జీతం ఇచ్చి అదికూడా లోన్‌గా రూ. 2000 మాత్రమే ఇచ్చారు. ఇప్పుడు మేము రోడ్డున పడ్డాము. ఉంటానికి ఇల్లు కూడా లేదు. లేబర్ కోర్టులో కేస్ పెడితే మాకు న్యాయం జరుగుతుందా? సలహా ఇవ్వగలరు.

**అంబునాయక్, మహబూబ్‌నగర్‌జిల్లా.**

వాసవి బ్యాంకు లిక్విడేషన్ చేశారు. అది పునరుద్దరణ జరిగే అవకాశాలు ప్రస్తుతానికి లేవు. మీకు రావల్సిన బకాయిలు, డబ్బులు, ఏమైనా ఉంటే వాటికోసం లేబర్‌కోర్టులో కేసువేసి పొందవచ్చును. అంతకుమించి ఏ హక్కులు ఉండవు.

## ఒరిజినల్ బిల్లు, నష్టపరిహారం కోసం ఒకేసారి కేసు వేయవచ్చా?

మేము ఒక బట్టల షాపులో షర్ట్, ఫ్యాంట్ తీసుకున్నాము. కాని బిల్లు ఇవ్వమంటే మామూలు కాగితంపై (దానిమీద షాపుపేరులేదు. ముద్రలేదు) అమౌంట్ వేసి ఇచ్చాడు. మేము మరుసటి రోజు వాపసు ఇవ్వడానికిపోతే వస్తువులు వెనక్కి తీసుకోము ఎక్స్ఛేంజ్ చేసుకోం అని చెప్పారు. 300/- బిల్లులో అంతే వస్తువులు తీసుకోవాలా లేదా 100,150 వరకు తీసుకొని మిగిలిన డబ్బులు తీసుకోవచ్చా?

నేను వినియోగదారుల ఫోరమ్‌లోకి వెళితే ఈ బిల్లు చెల్లదు. మీరు ఒరిజినల్ బిల్లు అడగండి. ఇవ్వకపోతే లాయర్‌ని చూసి పోలీస్ కేసుపెట్టండి. షాపు పేరు, రిజిస్టర్‌నెం. ముద్ర వంటివి ఉన్న బిల్లు ఒరిజినల్ బిల్లు మీదే చెల్లుతుంది. ఒరిజినల్ బిల్లు లేకపోతే మేము ఏమి చేయలేము అని అన్నారు.

ఒరిజినల్ బిల్లు అడిగితే ఇవ్వను. మాకు సేల్స్‌టాక్స్ 100 పడుతుంది. నీవు ఇస్తే ఒరిజినల్ ఇస్తాం అని షాపువాడంటున్నాడు. కేసు పెడతావా పెట్టుపో. నేను బి.ఎల్ చేసినా నాకు అంతే తెలుసు అని మాట్లాడాడు. కావున మేము ముందు లీగల్ నోటీసు ఇచ్చిన తర్వాత కేసుపెట్టి ఒరిజినల్ ఇచ్చిన తర్వాత నష్టపరిహారం క్రింద 500/- అడగాలనుకున్నాం. ఒరిజినల్ బిల్లు, నష్టపరిహారం రెండు ఒకేసారి అడగవచ్చా. ఎంత అమౌంట్ అడగాలి. వస్తుందా రాదా?

**చక్రవర్థన్‌రెడ్డి**

**బుక్కాపురం, కర్నూల్‌జిల్లా.**

మీరు ఏ వస్తువుకొన్నా... బిల్లు పొంది ఉంటేనే ఆ షాపు వారిపై కేసు వేయవచ్చును. బిల్లు లేకుండా కేసు వేయలేముగదా. మీరు ఆ షాపులోనే కొన్నట్లు ఋజువు సాక్షుల్ని ప్రవేశపెట్టలేరు. అతను మీకు ఆ వస్తువు అమ్మలేదు అనే అంటాడు. సేల్స్‌టాక్స్ 7% లేదా 11% ఉంటుంది. కాని రూ. 100/- ఉండదు. మీరు కేసే వేయాలనుకుంటున్నారంటే అతడు ఇప్పుడు అసలు బిల్ కూడా ఇవ్వకపోవచ్చు. సరియైన పత్రాలు, ఋజువులు, ఉంటేనే కోర్టు సరియైన పత్రాలు, ఋజువులు, ఉంటేనే కోర్టులో న్యాయపరంగా న్యాయం జరుగుతుంది. బిల్లు ఇవ్వనందుకు సేల్స్ టాక్స్ అధికారులకు ఫిర్యాదు చేయండి.

## మేజరైతే... దావా వేయండి

నా పేరు నాగుర్ బి. నా తండ్రిగారు నా తల్లి చనిపోయిన తరువాత 15 రోజులకు నా పేర 50వేలరూపాయలు ఖరీదు చేసే ఆస్తికి 100 రూపాయల స్టాంపుమీద అగ్రిమెంటు వ్రాసినారు. నాకు ఎప్పుడు కావలెనంటె అప్పుడు విక్రయం చెస్తానని వున్నది. ఇప్పుడు విక్రయం చెయ్యనంటున్నాడు. నేను కోర్టుకుపోతే నాకు న్యాయం జరుగుతుందా తెలుపగలరు.

**ఓ పాఠకురాలు**

మీ తండ్రిగారు మీ పేరుమీద వ్రాయవలసిన పరిస్థితులు, మీ వయసు వివరంగా వ్రాయలేదు. మీ తండ్రిగారు మరో వివాహం ఏమైనా చేసుకున్నారా. లేక మీరే వారసులా? మీ బాగోగులు, మీ తండ్రిగారు చూడడంలేదా? మీరెక్కడుంటున్నారు. మీకు ప్రస్తుతం డబ్బుల అవసరం ఏమిటి? ఇవన్ని వ్రాసి ఉంటే బాగుండేది. మీరు మేజర్ అయిఉంటే ఆ అగ్రిమెంటుని బట్టి అవసరాన్ని బట్టి ప్రవర్తించవలసి ఉంటుంది. అగ్రిమెంట్‌ని బట్టి మీ నాన్నగారు నడుచుకోకపోతే దావా వేయవచ్చును.

# రుచి



## నిమ్మకాయ షర్బత్

కావలసిన వస్తువులు:

| | | |
|---|---|---|
| నిమ్మరసం | : | ఒక గ్లాసు |
| పంచదార | : | నాలుగు గ్లాసులు |
| నీళ్ళు | : | అర గ్లాసు |
| ఉప్పు | : | ఒక స్పూన్ |

**తయారుచేసే విధానం:** రసం ఉన్న మంచి నిమ్మకాయలు తీసుకొని రసం పిండుకోవాలి. పంచదారలో నీళ్ళుపోసి పాకం పట్టాలి. ఉప్పు, నిమ్మరసం కలిపి పాకంలో పోసి ఒకసారి కలిపి దించాలి. పాకం బాగా చల్లారిన తరువాత పొడి సీసాలో పోసి మూత పెట్టాలి. ఒక గ్లాసు నీళ్ళకు రెండు స్పూన్ల షర్బత్ కలిపి సర్వ్ చేయాలి. రోజూ ఉదయమే పరగడుపునే కొద్దిగా తేనె కలుపుకొని తాగితే మంచిది. లావుగా ఉన్నవారు కొద్దిగా సన్నబడతారు.

## జింజర్ షర్బత్

కావలసిన వస్తువులు:

| | | |
|---|---|---|
| అల్లం | : | పావు కిలో |
| నిమ్మకాయలు | : | ఎనిమిది |
| పంచదార | : | ఒక కిలో |
| ఉప్పు | : | ఒక స్పూన్ |

**తయారుచేసే విధానం:** అల్లం శుభ్రంగా కడిగి మెత్తగా నూరి, రసం తీయాలి. నిమ్మకాయలు రసం తీసుకోవాలి. నిమ్మరసంలో ఉప్పు కలపాలి. ఒక గిన్నెలో పంచదార, అల్లం రసం పోసి సన్న సెగమీద లేతపాకం వచ్చేటట్లు కలియబెట్టాలి. దానిలో నిమ్మరసం పోయాలి. బాగా చల్లారిన తరువాత సీసాలో పోసి మూత పెట్టుకోవాలి. ఇది ఆరోగ్యానికి చాలా మంచిది.



# కలం స్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

**మీ**క్కూడా వీళ్లలాగా కలం స్నేహం చెయ్యాలని వుందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకుని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్ ఫొటోను అతికించి పోస్టు చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలూ చెప్పండి. వాళ్లకు కూడా కలం స్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే. మరి మా అడ్రస్: **కలం స్నేహం**, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

**పేరు :** ఎం.దివ్యాకులకర్ణి
**వయసు :** 9 సం॥
**చదువు :** 5వ తరగతి
**హాబీలు:** చదవడం, బొమ్మలేయడం, డాన్స్ చేయడం
**లక్ష్యం:** మంచి నటి కావడం
**చిరునామా:** ఎం.దివ్యాకులకర్ణి, డాటరాఫ్ శ్రవణ్‌కుమార్, ఇంటి నెం. 3-2-108/4, భారత్ టాకీస్ రోడ్, మీనానగర్, భువనగిరి, నల్లగొండ.

**పేరు :** ఇ.మహేంద్ర రెడ్డి
**వయసు :** 16 సం॥
**చదువు :** 10వ తరగతి
**హాబీలు:** చదవడం, క్యారమ్స్ ఆడటం, జోక్స్ వేయడం, న్యూస్ చూడడం.
**స్కూలు:** ఎస్‌కెపివివి హెచ్‌హెచ్ స్కూల్
**చిరునామా:** ఇ.మహేంద్ర రెడ్డి, సన్నాఫ్ అప్పారావు రెడ్డి, ఇంటి నెం. 5-6/5-3, గాంధీ బొమ్మ స్ట్రీట్, లంబాడీపేట, విజయవాడ.

**పేరు :** జి.అంజయ్య
**వయసు :** 15 సం॥
**చదువు :** 9వ తరగతి
**హాబీలు:** క్రికెట్ ఆడడం, టీవీ చూడడం, ప్రజాశక్తి చదవడం
**లక్ష్యం:** గొప్ప క్రికెటర్ కావడం.
**చిరునామా:**
**జి.అంజయ్య,** సన్నాఫ్ బసంతి, మాందాపూర్ (గ్రామం), రాయికోడ్ (మం), మెదక్.

**పేరు :** కె.అన్వేష్‌రెడ్డి,
**వయసు:** 13 సం॥
**చదువు:** 8వ తరగతి
**హాబీలు:** పాటలు వినడం, బొమ్మలేయడం, ఆటలు ఆడడం, కథలు చదవడం
**స్కూలు:** జెఎంజె హైస్కూల్
**లక్ష్యం:** సైంటిస్టు కావడం
**చిరునామా:** కె.అన్వేష్‌రెడ్డి, సన్నాఫ్ మల్లారెడ్డి, ఇంటి నెం. 2-5-163/1, వాటర్ ట్యాంక్ వెనుక, నక్కల గుట్ట, హన్మకొండ.

**పేరు :** టి.మీర్జావలి
**వయసు :** 15సం॥
**చదువు :** 9వ తరగతి
**హాబీలు:** ప్రజాశక్తి చదవడం, చదరంగం ఆడడం
**లక్ష్యం:** ఉన్నత వ్యక్తి కావడం
**స్కూలు:** జడ్‌పి హైస్కూల్
**చిరునామా:** టి.మీర్జావలి, సన్నాఫ్ నాగూర్ మీరావలి, 9వ తరగతి, జడ్‌పిహెచ్‌ఎస్, వెలిగండ్ల (గ్రామం), ప్రకాశం.

**పేరు :** వి.ఆంజనేయులు
**వయసు:** 13 సం॥
**చదువు :** 7వ తరగతి
**హాబీలు:** చదవడం, రాయడం, పాటలు పాడడం, ఖోఖో ఆడడం, ప్రజాశక్తి చదవడం
**లక్ష్యం:** టీచర్ కావడం
**చిరునామా:** వి. ఆంజనేయులు, సన్నాఫ్ చంద్రయ్య, పసుపుల (గ్రామం), కోడేర్ (మం), నాగర్‌కర్నూల్ (తా), మహబూబ్‌నగర్-509209.

**పేరు :** ఎం.శ్రీనివాస్
**వయసు :** 15 సం॥
**చదువు :** 9వ తరగతి
**హాబీలు:** పుస్తకాలు చదవడం, డ్రాయింగ్ వేయడం, టీవీ చూడడం
**చిరునామా:** ఎం.శ్రీనివాస్, సన్నాఫ్ మానయ్య, రాయికోడ్ (గ్రా & మం), మెదక్.

**పేరు :** ఎం.వేణుగోపాల్
**వయసు :** 14 సం॥
**చదువు:** 9వ తరగతి
**హాబీలు:** క్రికెట్ ఆడడం
**లక్ష్యం:** ఇంజనీర్ కావడం.
**చిరునామా:**
ఎం. వేణుగోపాల్, కొండేపి, ప్రకాశం.